# మహనీయుల మహితోక్తులు



అంకితం :

**జిజ్ఞాసువులకు**

రచన :

**పిరాట్ల వెంకట శ్రీధర్**

ప్రచురణ :

**ఆర్ష సంస్కృతి ప్రచార భారతి**

38-34-67, ఎఫ్.సి.ఐ. కోలనీ

మర్రిపాలెం, విశాఖపట్నం - 530 018

ఫోన్ : 0891-2799866, 0891-5528167

# దాతల పరిచయం

***ఓ౩మ్ శంనో మిత్రస్యం వరుణః***

కీ॥శే॥ శ్రీ రావాడ సత్యనారాయణ గారు తన సుధీర్ఘ జీవనయాత్రలో 30 సం॥లు విజయనగరంలో ఇండియన్ ఆర్మీలో ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజనీర్లతో కలిసి పనిచేసి యున్నారు. ఈయన సతీమణి శ్రీమతి రావాడ వరలక్ష్మి పతిధర్మములనే అనుసరిస్తున్న సహధర్మచారిణి. వీరి దాంపత్య ఫలితమే భారతీయ సంస్కృతి కీర్తి కిరీటంలో పొదగబడిన మూడు రత్నాలు.

**జ్యేష్ఠపుత్రుడు :** శ్రీ రావాడ రవి. పూణేలో ఇండియన్ ఆర్మీలో కల్నల్‌గా పనిచేస్తున్నారు. భార్య శ్రీమతి వెన్నెల. ఇద్దరు పిల్లలు.

**మధ్యముడు :** శ్రీ రావాడ శశి, ప్రస్తుతం నైరోబీలో నాలుగు ప్రింటింగ్ కంపెనీలకు మేనేజింగ్ డైరక్టర్‌గా వర్తిస్తున్నారు. భార్య శ్రీమతి సాహితి. ఇద్దరు కుమార్తెలు

**కనిష్ఠపుత్రుడు :** శ్రీ రావాడ కృష్ణ. ప్రస్తుతం ఉగాండాలో పనిచేస్తున్నారు. భార్య శ్రీమతి భారతి.

నా బాల్యమిత్రుడు, చిరకాల స్నేహితుడు శ్రీ రావాడ శశి దంపతులు అమితంగా ప్రోత్సహించి, భారతీయ సంస్కృతి, వైదిక ధర్మ ప్రచార నిమిత్తం కెన్యాకు ఆహ్వానించడం జరిగింది.

తండ్రిగారైన కీ॥శే॥ శ్రీ రావాడ సత్యనారాయణగారు సంస్మరణార్థం రూ॥ 25000/- ప్రచురణకై విరాళంగా ఇచ్చి సంస్కృతీ ప్రచార పర్వంలో ధార్మిక సార్వభౌములైన శ్రీ రావాడ శశి, శ్రీమతి సాహితీ దంపతులకు హృదయపూర్వక ధన్యవాదములు. వారి కుటుంబము యొక్క ధార్మికశక్తి, శుక్లపక్ష చంద్రుని వలె దినదినాభివృద్ధి చెందవలెనని ఆశిస్తూ....

భవదీయుడు

**పిరాట్ల వెంకట శ్రీధర్**

# ఉపోద్ఘాతం

**G.Venkata Rao**
Rtd. General Manager (Vigilance)
Visakhapatnam Steel Plant

Visakhapatnam
Thursday
16th February, 2006

వేదోక్తమైన అనేక విధములైన మానవ ధర్మాలను గురించి బ్రహ్మశ్రీ పిరాట్ల వెంకట శ్రీధర్‌గారు అనేక సందర్భాలలో (ఆకాశవాణిలో) చేసిన ధర్మప్రసంగాలను ఒక సంకలనంగా కూర్చి ఈ పుస్తకరూపంలో ప్రచురించటం వల్ల ఈ అమూల్యమైన విషయాలన్నీ జనబాహుళ్యానికి సులభంగా అందుబాటులోనికి వస్తున్నాయి. ఈ సంకలనంలో మానవుడు తన జీవితంలో పుట్టిన దగ్గర నుంచి మరణించేవరకు సదా ఆచరించవలసిన ధర్మాలను వివరంగా, సహేతుకంగా అనేక పవిత్ర గ్రంథాలలోని శ్లోకాలను ఉదహరిస్తూ, విశ్లేషిస్తూ సప్రమాణికంగా ప్రస్తావించడం జరిగింది. జీవుడు ఏవిధంగా మనసా, వాచా, కర్మణా ప్రవర్తిస్తే పాపలంపటంలో, విషయలోలత్వంలో చిక్కుకోకుండా ప్రశాంతమైన పరిపూర్ణమైన జీవనాన్ని గడిపి ఆ పరమాత్మలో ఐక్యమై జన్మరాహిత్యం, మోక్షం పొందగలడో శ్రీ పిరాట్ల వెంకట శ్రీధర్‌గారు వివరించారు.

పూర్వకాలంలో మహర్షులు, నిత్యం ఆచరించే యజ్ఞములు, నేటికీ కొందరు చేసే అగ్నిహోత్ర కర్మల యొక్క విశిష్టతను, పరమార్థాన్ని సరళంగా ఇందులో వివరించారు. ఇందలి విషయములను చదివి, ఆకళింపుజేసుకొని, నేటి మానవులు వేదోక్తమైన హైందవ సంస్కృతిని పునశ్చరణం చేసుకొని తదనుగుణంగా జీవనం సాగించి ధన్యులవుతారని నేను మనసారా భావిస్తున్నాను.

శ్రీ పిరాట్ల వెంకట శ్రీధర్ గారికి అభినందనలతో ....

ఇట్లు
**గోనెళ్ళ వెంకటరావు**

# ఒక్కమాట

వేదములు భగవత్ ప్రసాదములు. సంస్కృత భాష బాగా వాడుకలో వున్నప్పుడు, ఈ వేదజ్ఞానం చాలామందికి వుండేది. అందరికీ తెలిసేది. కాని, రానురాను కాలానుగుణంగా వచ్చినమార్పులలో మనం ఈ సంస్కృతభాషను మరిచాము. సంస్కృత సాహిత్యంలో రెండు రకాలున్నాయి. వైదికము, లౌకికము. వేదములు, వేదానుకూల బ్రాహ్మణములు, అరణ్యకములు, దర్శనములు, ఉపనిషత్తులు మొదలైనవి వైదికము. పురాణములు, ఇతిహాసములు, కావ్యములు మొదలైనవి లౌకిక సాహిత్యము దాదాపు 5000 సంవత్సరముల వరకు ఈ వైదిక సాంప్రదాయమే ఆచరణలో వుండేదని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. ప్రజల ఆలోచనా విధానాలలో వచ్చిన మార్పుల వలన ఈ వైదిక సంస్కృతి మరుగున పడిపోయింది. అటువంటి సంస్కృతీ జ్ఞానాన్ని తిరిగి ప్రజా బాహుళ్యంలోకి తీసుకొని రావాలి. పూర్వపు వైభవాన్ని మళ్ళీ ఒక్కసారి చవిచూడాలి. ఈరోజుల్లో మనకు జ్ఞానం లభించింది. కాని దానిలో నాణ్యత కొరవడింది. నాణ్యత లోపించిన జ్ఞానానికి విలువ వుండదు. కేవలం ధర్మాచరణము వలననే దాని విలువ పెరుగుతుంది. ఎందుకంటే ధర్మం, జ్ఞానం, రెండూ సమాన భావసారూప్యం కలిగి వుంటాయి.

మహర్షులు ప్రసాదించిన ఈ జ్ఞానాన్ని అరటిపండు వలిచిపెట్టినట్టు ప్రతి విషయం గూర్చి వివరించడం జరిగింది. "ప్రాచీన కాలంలో స్త్రీల పాత్ర ఎలా వుండేది ? స్త్రీల స్థితిగతులు ఏమిటి ? నేటి సమజాంలో స్త్రీ పాత్ర ఏమిటి ? గృహ యజమాని తండ్రి అయినవాడు ఏవిధంగా వర్తించాలి ? విద్యార్థులు ఏవిధంగా నడుచుకోవాలి ? మనిషిగా పుట్టి మనీషిగా మారాలంటే ఏ విధమైన వ్యక్తిత్వాన్ని అలవరచుకోవాలి" మొదలగు విషయాలు చర్చించడం జరిగింది.

మానవులుగా జన్మించిన తరువాత ప్రముఖంగా ఆలోచించవలసింది క్రమశిక్షణ గురించి. క్రమశిక్షణ అనేది జీవితాన్ని సక్రమ మార్గంలో పెట్టి

ఉన్నత ఆశయాలు కలవాడిగా తీర్చిదిద్దుతుంది. జీవితాన్ని సుఖమయం చేస్తుంది. వేదంలో ఎక్కువభాగం క్రమశిక్షణ గురించే చెప్పబడింది. అనేక ప్రాచీన గ్రంథాలలో వున్న సారాన్ని సూక్ష్మంగా, ఇందులో పొందుపరచడం జరిగింది.

**"మాతాభూమిః పుత్రోహం పృధివ్యా"** **॥అధర్వ॥**

ఓ భూమీ, నీవు నాకు తల్లివి, నేను నీ పుత్రుడను. మాతృభూమి యందు శ్రద్ధాభక్తులు వున్న మానవుడు నిత్యము పైవిధంగా ప్రార్థించాలి అని అధర్వ వేదం చెప్తుంది.

ప్రతిదేశము తన జాతిని, తన దేశీయులను చక్కని మార్గములో నడిపించుటకు ఒక మార్గమును ఏర్పరచుకుంటుంది. ఆ అభివృద్ధి మార్గమునే ఆ దేశ సంస్కృతి అంటారు. భారతీయత అనునది ఒక మతము కాదు. అది ఒక సంస్కృతి. అనగా సంస్కరించునది. మానవుని జీవన శైలి, విధేయ విధానము ఏవిధంగా వుంటే ఉన్నతి సాధించగలుగునో, అదే సంస్కృతి. భారతీయ సంస్కృతి బోధించేది ముఖ్యంగా భగవత్ సాక్షాత్కారము. భగవంతుని ఉనికి సంబంధమైన విశ్వాసము మానవులను చాలా ప్రభావితం చేస్తోంది. ఈ భగవంతుని విషయాలే భిన్నభిన్న విశ్వాసాలుగా మారి ప్రపంచములో అనేక మతాలను సృష్టించి ప్రచ్ఛన్న యుద్ధములను తీవ్రతరం చేసింది. ఏ సంస్కృతిలో భగవంతునికి సంబంధమైన ఆలోచన అలోలమై వుంటుందో ఆ సంస్కృతి ఎక్కువకాలం నిలువజాలదు. భారతీయ సంస్కృతీ సిద్ధాంతాలను తెలుసుకొని జాతి తన ధార్మిక వ్యవస్థ ద్వారా సత్యమును ఆచరణ రీత్యా తెలియజేయటం లోనే విజయం వుంది. యాంత్రిక జీవనంలో తలమునకలై మనిషి తనస్థితిని మరిచిపోకుండా ఈ జ్ఞానం కాపాడుతుంది. ఇది చదివి అందరూ ఆస్వాదించి, ఆనందిస్తారని ఆశిస్తూ,

**"శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్"**

భవదీయుడు

**పిరాట్ల వెంకట శ్రీధర్**

# పీఠిక

**ఓం పరబ్రహ్మణే నమః**

భారతీయ సంస్కృతీ సాహిత్యంలో వేదములు అతి ప్రాచీనమైనవి. మానవ జీవితము రమ్యంగానూ, సౌశీల్యవంతంగానూ, సంస్కారవంతంగానూ తీర్చి దిద్దుకోవడానికి మహర్షులు ఏర్పరచిన వెలుగు బాటలే వేద ధర్మాలు. నేడు సంఘంలో నెలకొన్న సాంఘిక అభద్రత, అశాంతి, అసుఖము వీటన్నింటికీ సమాధానము వేదములో మనకు లభిస్తుంది. గతంలో కొన్ని స్వార్థపరశక్తులు ఈ వేదజ్ఞానాన్ని మరుగున పడవేసి ప్రజలకు, అందరికీ అందుబాటులో లేకుండా చేసి సమాజాన్ని, భారతీయ, వైదిక సంస్కృతీ వైభవాన్ని ఈ స్థితికి తీసుకొని వచ్చాయి అనడంలో ఎంతమాత్రం సందేహం లేదు.

మనదేశము కర్మభూమి. కర్మలు చేసి ఫలితాన్ని అనుభవించమని వేదం చెప్తోంది. మానవుల యొక్క కర్మలను బట్టి సుఖ, సంతోషాలు లభిస్తాయి. భగవంతుడు వాటిని ఎవరికీ ఉచితంగా పంచిపెట్టడు. కర్మహీనులకు ఈ భూమిపై దుఃఖము, అవమానము తప్ప మరొకటి లభించదు. స్వయంగా మానవుడు ఏమీ చేయలేడని అంతా ఈశ్వరేచ్ఛ అని సర్వానికి అతడే బాధ్యుడని అంటుంటాము. ఈశ్వరుడే మనుష్యులతో కర్మలు చేయిస్తున్నట్లైతే దానికి సంబంధించిన సుఖ, దుఃఖాల ఫలితాలు మానవులెందుకు అనుభవిస్తున్నారు. భగవంతుడు తాను చేయించిన కర్మల ఫలితాలు తానెందుకు అనుభవించడం లేదు. ఇటువంటి నమ్మకాలు భగవంతుడినే అన్యాయకారిని చేస్తున్నాయి. భగవంతుడెప్పుడూ తన ఉద్దేశ్యములను మనుషులపై రుద్దడు. కర్మలు చేయటంలో మానవులు

కడు స్వతంత్రులు. ఈ విషయం పాణిని మహర్షి వ్యాకరణ సూత్రాలలో చెప్పటం జరిగింది. అందుకే మానవులకు మనస్సు అనే పదార్థాన్ని సృష్టించి, విచక్షణా జ్ఞానమనే బుద్ధిని ప్రసాదించాడు. అందుకే శ్రీకృష్ణుడు భగవద్గీతలో ఈ కర్మ సిద్ధాంతానికే ప్రాధాన్యతనిచ్చాడు. వైదిక కర్మలు నేటి సమాజంలో లోపించటం వలననే నేటి ఈ పరిస్థితి. ఈ స్థితి నుండి తప్పుకోడానికి వేదమొక్కటే మార్గము.

**"నాన్యః పంథా విద్యతే అయనాయ"** – వేరు మార్గము లేదు. ధర్మాచరణము వలన నీచ వర్ణస్తుడు ఉత్తమ వర్ణస్తుడుగా మారటం, అధర్మాచరణము వలన ఉత్తమ వర్ణస్తుడు నీచ వర్ణస్తుడుగా మారటం ఆపస్తంభ సూత్రాలలో చెప్పడం జరిగింది. ఈవిధమైన తాత్వికజ్ఞానం కొరవడిన ఈ వింత పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నానికి ఎవరో వచ్చి మనకు చెప్తారని చూడకుండా, స్వయంగా మానవుడు తను సాధించవలసినవి తెలుసుకొని, ప్రయత్నంతో సాధించాలి. దానికోసం వైదిక విజ్ఞానం మనల్ని ఎప్పుడూ ఆహ్వానిస్తూనే ఉంటుంది.

సర్వోత్తమ గుణయుక్తుడు, పూర్ణవిద్వాంసుడు చరాచరాత్మకమగు సమస్త ప్రాణికోటికి గురువు అయినటువంటి పరమేశ్వరుడు ప్రసాదించిన ఈ వేదజ్ఞానాన్ని ప్రజలు అనుసరించినంతకాలం మానవులను ఏ శక్తి నిర్వీర్యము చేయలేదు. సమస్త శక్తులు భారతీయ సంస్కృతీశక్తి ముందర తలవంచవలసిందే. ఇది ఋషి ప్రణీతము. నిస్సందేహము. ఇది కేవలము వేదాలను వల్లెవేసినంత మాత్రాన సాధించలేము. వాని అర్థాలను తెలుసుకొని, బుద్ధితో విశ్లేషించుకొని అచరించినప్పుడే సాధించగలము. ఆలోచించండి ఈ భూమి మీద పుట్టి, ఈ గాలి పీలుస్తూ, ఈ సంస్కృతిని ఆచరించకపోవటం కన్నతల్లిని మరచిపోవడమే అవుతుంది.

**'జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి'**

ఈ మహోత్కృష్టమైన భావరాశిని ప్రజలు సహృదయంతో అర్థం చేసుకొని, ఆస్వాదించి ఆనందిస్తారని ఆశిస్తూ ...

**పిరాట్ల వెంకట శ్రీధర్**

# కృతజ్ఞతలు

వైదిక ధర్మప్రచార మహాయజ్ఞంలో తగిన ప్రేరణనిచ్చి ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో 2002 నుంచి 2005 వరకు దాదాపు 30 ప్రవచనాలు చేయించినటువంటి ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రంలో పనిచేస్తున్న శ్రీ ముళ్ళపూడి భాస్కరరావు గారికి, శ్రీ రొక్కం కామేశ్వరరావు గారికి,

ఆకాశవాణిలో వచ్చిన ప్రవచనాలు పుస్తకరూపంలో తయారు చేసి అందరికీ అందుబాటులోకి తేవాలనే స్ఫూర్తిని ప్రసాదించిన డా॥ శ్రీమతి సంధ్యావందనం లక్ష్మీదేవి, శ్రీ శ్రీనివాసరావు దంపతులకు,

ఆర్ష సంస్కృతి ప్రచార భారతి సంస్థ స్థాపనకు స్ఫూర్తినిచ్చి చేయూతను ఇచ్చినటువంటి Ex.Jt.G.M.(Traffic), Steel Plant శ్రీ పి.బి.వి. కామేశ్వరరావు గారికి,

నా ప్రతి ఆలోచనను అర్థం చేసుకొని వారి యొక్క శక్తులు ధర్మప్రచారానికై వినియోగిస్తున్న శ్రీయుతులు సి.గోపి (Assistant Manager - Steel Plant), సురేష్ గజ (Junior Manager - Steel Plant), ఎన్.వి. రమణమూర్తి (Junior Officer, - Steel Plant) గార్లకు,

సహృదయ ధన్యవాదములు.

భవదీయుడు

**పిరాట్ల వెంకట శ్రీధర్**

# విషయసూచిక


| నెం. | అధ్యాయం | పేజీ |
|---|---|---|
| 1. | ఆర్యావర్త వైభవం | 11 |
| 2. | ధర్మ పథం | 14 |
| 3. | ధర్మానుష్ఠానము - వాని స్థితి | 18 |
| 4. | ధర్మసాధనము | 22 |
| 5. | ఇంద్రియ నిగ్రహము | 24 |
| 6. | బ్రహ్మచర్య మహిమ | 28 |
| 7. | మాతృదేవోభవ | 31 |
| 8. | సభ్యత - సంస్కారము | 34 |
| 9. | వైదిక విజ్ఞానము | 37 |
| 10. | వేదములలో స్త్రీ ధర్మములు | 40 |
| 11. | విద్యార్థి | 44 |
| 12. | స్వాధ్యాయము | 48 |
| 13. | భారతీయ సంస్కృతి-వేదములు - 1 | 51 |
| 14. | గృహస్థాశ్రమ ధర్మములు | 55 |
| 15. | అగ్ని హోత్రము | 59 |
| 16. | గాయత్రి | 63 |
| 17. | భారతంలో ధర్మం | 66 |
| 18. | భారతీయ సంస్కృతి - వేదములు - 2 | 72 |
| 19. | అహింసా సిద్ధాంతము | 78 |

# ఆర్యావర్త వైభవం

మన దేశము భారతదేశము. ఈ దేశమునకు ఆర్యావర్తమని పేరు ఉన్నదని మను ధర్మశాస్త్రము చెప్తోంది. అందుకే మనము ఏదైనా పుణ్యకార్యమొనర్చినపుడు "ఆర్యావర్తే, పుణ్యభూమౌ" అని చెప్పుకోవడం జరుగుతుంది. మన దేశమునకు ఆర్యావర్తమని పేరు వేదోక్తముగా లభించినట్లు ప్రాచీన ఋషుల గ్రంథములను బట్టి తెలుస్తున్నది. సంస్కృతంలో ప్రతి పదమునకు ఒక ధాతువు అనగా ఒక శబ్దమూలము వుంటుంది. "ఋ" అను ధాతువునకు "యత్" ప్రత్యయము చేర్చుటచే కలుగు శబ్దము ఆర్య. ఆర్య అను పదమునకు ఉత్తమ గుణకర్మ స్వభావము గల వ్యక్తి అని శబ్ద శాస్త్ర పారంగతుడైన పతంజలి మొదలగు మహర్షులు చెప్తారు. "ఆర్య : ఈశ్వర పుత్ర :" యాస్కమహర్షి విరచిత నిరుక్తశాస్త్రము చెప్తోంది. ఆర్యుడనగా ఈశ్వరపుత్రుడు. వేదము భగవంతుని జ్ఞానము. భగవంతుడు అందరికీ తండ్రి. తండ్రి ధర్మములాచరించేవాడు అతని పుత్రుడు. కావున వేద విహిత కర్మలాచరించేవారు ఆర్యులని మనకు మహర్షి ద్వారా తెలుస్తున్నది.

## "కృణ్వంతో విశ్వమార్యమ్"

ఋగ్వేదం చెప్తోంది విశ్వమంతా ఉత్తమ గుణకర్మ స్వభావులైనవారు కావాలి, అటువంటి వ్యక్తులు అత్యధిక సంఖ్యలో నివసించిన ఈ దేశమునకు ఆర్యావర్తమన్న పేరు సార్ధకమైనదని పై వేదమంత్రము వలన తెలుస్తున్నది. ప్రపంచ చరిత్రను పరిశీలించిన ఏ దేశములోనూ ఉద్భవించనంత ఎక్కువగా ఋషులు, మహర్షులు, త్యాగధనులు, వీరులు, వీరవనితలు, విద్వాంసులు, విజ్ఞానవేత్తలు, ఆదర్శపురుషులు ఈ ఆర్యావర్తము నందు ఉద్భవించారు.

ఈ దేశవాసుల ఆచార విచారములు, ఆహార వ్యవహారములు దైవిక

దినచర్యలు సర్వమూ వేదానుకూలము కావాలి. వేదము నందలి సమస్త విషయములు కూడా పరమేశ్వరుని బుద్ధిపూర్వకముగా అనగా సర్వజ్ఞతో కూడినవని మనకు కణాద మహర్షి విరచిత వైశేషిక దర్శనమునసరించి తెలుస్తున్నది.

"బుద్ధి పూర్వ వాకృతిర్వేదే"

వేదములు స్వత:ప్రమాణములు. ఇతర ఋషి ప్రణీత గ్రంథములన్నియు వేదములనాశ్రయించియే సమస్త విషయములను తెలిసికొనవలయును. వేదము నందున్న వ్యావహారిక జీవనవిధానము ద్వారానే పారమర్థిక ఫలసిద్ధికై, యోగ్యములగు ఆచార వ్యవహారములు, వేదోక్త దినచర్యలు, మానవ జీవన సహజ సంపదలుగా పరమేశ్వరుడు ప్రసాదించినవని వారి వారి సాధన వలన తెలిసికొని వేదాధ్యయన తత్పరులై వైదిక కర్మానుష్టానములు విధిగా ఆచరించుచూ, ధర్మానురాగులై, సార్థకజన్ములైనట్లు ఈ దేశచరిత్రల ద్వారా మనకు తెలుస్తోంది.

"ఏతత్ దేశ ప్రసూతస్య సకాశాదగ్ర జన్మనః
స్వమ్ స్వమ్ చరిత్రం శిక్షేరన్ పృధ్వ్యాం సర్వ మానవః"

ఓ ప్రపంచ మానవులారా ! ఈ ఆర్యావర్త పుణ్యభూమికి చెందిన బ్రహ్మజ్ఞానుల నుండి మీ సమస్త సుఖశాంతుల కొరకు అవసరమగు సత్య విద్యలను గ్రహించి సుఖములు పడవలసిందిగా మను ధర్మశాస్త్రము చెప్తోంది. లోక కల్యాణము తప్ప మరో సంకల్పం లేని పరమ పావన చరిత్రులగు ప్రాచీన ఋషులు అతి ప్రాచీనకాలములోనే ఈ పిలుపు నిచ్చారు. ఒక దేశము యొక్క సంస్కృతి ఆదేశము యొక్క వాఙ్మియము మీద ఆధారపడి ఉంటుంది.

"సా ప్రథమా సంస్కృతీ విశ్వా వారా :" ॥యజు॥

అని యజుర్వేదము, ప్రపంచ జీవన విధానమునకు మార్గదర్శకము మొట్టమొదటి ఈ వేద సంస్కృతి, మానవుడు ఎట్టి క్రియా నిష్ఠానములు

చేయునో దాని కనుగుణములైన సంస్కారములే అతని హృదయమునందు ముద్రించబడును. కరుణాసముద్రుడు, పరమ పావనుడు అయిన పరమేశ్వరుడు మానవులాచరింపదగిన కర్మలు వాని విధి, విధానములు వేదమునందు నిర్దేశించి యున్నాడు. వేద విహిత కర్మాచరణము వలన అంతఃకరణ శుద్ధి కలిగి సత్యజ్ఞానము, సత్యగమనము, సత్యప్రాప్తి సిద్ధించునని యజుర్వేద మంత్రము ద్వారా తెలుస్తుంది.

శంఇతిఓ3మ్

**ఓం యజ్ఞేన యజ్ఞ మయజన్త దేవాః**
**తాని ధర్మాణి ప్రథమా న్యాసన్ ।**
**తే హ నాకం మహిమానః సచన్త**
**యత్ర పూర్వే సాధ్యాః సన్తి దేవాః**

**(యజుర్వేదం 31-16)**

**భావార్థము :**

ఉత్తములు, ధర్మాత్ములు, విద్వాంసులు, యజ్ఞరూపుడైన పరమాత్ముని యజ్ఞంతోనే కొలుస్తారు అని యజుర్వేదం చెప్తోంది. మానవులు అగ్ని హోత్రముతో ఆ పరమాత్ముని ధ్యానించి శ్రేష్ఠమయ, యజ్ఞమయ జీవితాన్ని సాగించాలి.

# ధర్మ పథం

## "ధారణాత్ ధర్మ ఇత్యాహుః"

ధరించతగినది కావున ధర్మము అంటారు. సృష్టిలో సమస్త పదార్థములు తమ తమ ధర్మానుసారం వర్తిస్తూనే వుంటాయి. మానవుడు సంఘజీవి కావున జంతువులలాగా తాను ఒంటరిగా వుండలేడు. దొరికింది తింటూ తిరగలేడు. సంఘములో తాననుభవించు ప్రతి వస్తువు వెనుక ఎందరో మానవుల శ్రమ వున్నదని గుర్తెరిగినపుడే, తాను పొందిన జ్ఞానానికి సార్థకత.

మానవుల అభ్యుదయము, ని:శ్రేయససిద్ధి కొరకు ఋషులు తమ తపోబలముతో సాధించిన నియమాలే ధర్మ శాస్త్రములు. ఆ ధర్మశాస్త్రములను బుద్ధితో విచారించి, తనకన్నా వున్నత పదార్థముల విలువ తెలిసి, వానియందు విశ్వాసముంచి, దానిచే ప్రభావితుడై చేయు క్రియాచరణమునకు ధర్మము అని పేరు.

## "ధర్మో ధారయతే ప్రజాః"

ఆ ధర్మము ప్రజలను ధరించి వుంటుంది. ప్రజలు ఆ ధర్మాన్ని ధరించి వుంటారు. దేనిని ఆచరించినందువలన, మనిషి విషయములందు బద్ధుడుకాడో అదియే ధర్మము.

**"యన్మనసా ధ్యాయతే, తద్ వాచావదతి**
**య ద్వాచా వదతి తత్కర్మణా కరోతి**
**యత్ కర్మణా కరోతి తదభి సంపద్యతే"** ॥శ|బా॥

మానవుడు మనస్సులో తలచు దానిని వాక్కుతో చెప్తాడు. వాక్కుతో

చెప్పు దానిని కర్మేంద్రియములతో ఆచరిస్తాడు. ఏదైతే కర్మేంద్రియములతో ఆచరిస్తాడో దానికి తగిన ఫలితమును అనుభవిస్తాడు. దీని వలన మానవుడు సత్కర్మలు ఆచరిస్తే సత్ఫలితాన్ని, దుష్కర్మలాచరిస్తే దుష్ఫలితాన్ని పొందుతాడని స్పష్టము. కాబట్టి మనిషి ఆలోచనమీద తన మనుగడ వున్నదని సుస్పష్టము. ఈ ఆలోచన ఎంత వున్నతమైతే అతను అంత జ్ఞాని అవుతాడు. ఈ ఆలోచన ఉన్నతమైనది కావాలి. అన్నిటినీ మించి ధర్మబద్ధమైనది కావాలి.

**"జ్యోతిష్మత: పథో: రక్షధియాకృతాన్"** ॥ఋగ్॥

విజ్ఞానశీలురైన ఋషులచే నిర్మించిన వెలుగుబాటలు సదా రక్షించుకో వలెనని పై మంత్రాభిప్రాయము. వేదాధ్యయనము చేసి ప్రాచీన మహర్షులు భావి మానవ సమాజము వున్నతస్థితిలో పయనించుట కొరకు కొన్ని విశాల వెలుగుతో కూడిన సంస్కృతీ మార్గాలను నిర్మించారు. అవే వర్ణాశ్రమ ధర్మాలు. ఆ మార్గాన్ని పయనించువారు క్షేమముగా గమ్యాన్ని చేరగలుగుతారు.

**"ధియాకృతాన్"** అనగా అవి బుద్ధితోనూ, జ్ఞానముతోనూ నిర్మించ బడినవి.

విద్య, అభ్యుదయమునందు అభిరుచి కలవారై, సుగుణశీలురై, సత్యభాషణ, సదాచారము మొదలైన వానియందు నియమములు కలవారై, అభిమానము నుండి అపవిత్రత నుండి దూరులై, ఇతరుల మాలిన్యమును పోగొట్టువారై, సత్యాన్ని మాత్రమే వుపదేశించుచు, వేదవిహిత కర్మలచే తాము ప్రకాశించుచు, ఇతరులను ప్రకాశింపచేయు స్త్రీ పురుషులు ధన్యులు అని శాస్త్రము చెప్తుంది.

వాస్తవముగా లోకంలో మానవులకు శిక్షణనిచ్చేది ముగ్గురే ముగ్గురు. తల్లి, తండ్రి, ఆచార్యుడు. భూదేవి వంటి మాతృమూర్తి గర్భమున జన్మించి, అంతటి ఓర్పు, సహనము, మొదలగు శక్తులను అలవరచుకోవాలి. సూర్యునితో సమానమైన తండ్రి అడుగుజాడలలో క్రమశిక్షణ, సమయ

పాలనము మొదలగు శక్తులను అలవరచుకోవాలి. సకల చరాచర ప్రపంచమునకు ఆచార్యుడు గురువు పరమేశ్వరుడు.

**"స: పూర్వేషా మపి గురు కాలేనా న వచ్ఛేదాత్" ॥యో॥ద॥**

అతడు నిర్దేశించిన కర్మలాచరించి ఉత్తమ జ్ఞానాన్ని పొంది జీవితాన్ని సార్ధకము చేసుకోవాలి. ధార్మికులైన తల్లిదండ్రుల నుండి సంతానము పొందు జ్ఞానము, వుపయోగము మరి ఎవ్వరి నుండి కలుగదు. సంతానమునకు హితము చేయవలెనని కోరిక, ప్రేమ ఇతరులకుండదు.

**"ప్రశస్తా ధార్మికీమాతా విద్యతే యస్య స మాతృమాన్"॥వి॥నీ॥**

గర్భాదానము మొదలుకొని సంపూర్ణ విద్య అలవడు వరకు సంతానమునకు సత్యశీలత, సత్యసంధతనే వుపదేశించునట్టి స్త్రీ ధన్యురాలు. ఆచార్యులు కూడా శిష్యులకు అటువంటి జ్ఞానమునే బోధించాలి.

**"యాన్యస్మాకం సుచరితాని త్వయోపాస్యాని నో యితరాణి"**
**॥వి॥నీ॥**

ధర్మయుక్తములైన మా వుపదేశములనే గ్రహింపుము. మా యొక్క అధర్మయుక్తమైన కర్మలను వదలివేయమని శిష్యులకు వుపదేశించగలగాలి. ఇంతే కాకుండా క్రింద దృష్టియుంచి ఎగుడు దిగుడులను చూసి నడువవలెను. అనగా తనకన్నా వున్నతమైన వారితో మైత్రీభావముండాలి. తనకన్నా దిగువనున్న వారిని వున్నతస్థితికి తీసుకొనిరావాలి. వస్త్రముచే వడకట్టిన నీటిని త్రాగవలెను. అనగా ఎల్లప్పుడు పవిత్రమైన పదార్ధములే సేవించాలి. సత్యముచే పవిత్రమైన మాటలనే చెప్పాలి. మనస్సులో విచారించి బుద్ధితో తర్కించి కర్మలాచరించాలి అని తల్లి, తండ్రి, ఆచార్యుడు పిల్లలకు బోధించాలి. సత్యమైన మాటలతో మనసు పవిత్రమవుతుంది. విద్య, తపస్సుల వలన ఆత్మ పవిత్రమవుతుంది. కాబట్టి మానవుని బుద్ధి వృద్ధి కావాలంటే జ్ఞానమవసరము. సత్య ధర్మాచరణము వలననే అది లభిస్తుంది.

**"ధర్మ ఏవ హతో హంతి ధర్మో రక్షతి రక్షితః" ॥మను॥**

ధర్మాన్ని నాశనము చేయ ప్రయత్నించిన వానిని అది నాశనము చేస్తుంది. ధర్మాన్ని రక్షించు ప్రయత్నము చేసిన వానిని అది రక్షించి తీరుతుంది.

జడము, చేతన పదార్ధ సమ్మిళితమైన ఈ విశ్వము నందు అంతటా ఉత్సాహము, బలము, ఆనందము నిండి వుంటుంది. చీమలు సదా కార్య నిమగ్నమయి వుంటాయి. ఈ భూమి నిరంతరము గమనము కలిగి వుంటుంది. వాయువు అహర్నిశలు వీస్తూనే వుంటుంది. జలము ఎపుడూ ప్రవహిస్తూనే వుంటుంది. ఈ సృష్టిలో ఎక్కడ చూసినా ప్రతి పదార్ధము తన శక్తిని వెల్లడింప చేసేందుకు ప్రయత్నిస్తూనే వుంటాయి. ఈ విశ్వమంతా కేవలం ఒకే ధర్మమును బోధిస్తుంది. వ్యక్తి తన యొక్క మరియు సమాజము యొక్క సుఖము, శుభము, సద్గతి మొదలగువాని ప్రాప్తికి నిరంతరము అనగా నూరేండ్ల పర్యంతము కర్మలు చేయుచూనే వుండవలెను ప్రతిఫలాపేక్షలేక.

శంఇతిఓ3మ్

**ఓం ఆ బ్రహ్మన్ బ్రాహ్మణో బ్రహ్మవర్చసీ జాయతామాం**

**(యజుర్వేదం)**

**భావార్ధము :**

బ్రహ్మవిదులు, బ్రాహ్మణులు, విద్వాంసులు, కర్మనిష్ఠులు, త్యాగశీలురు అయిన జ్ఞానులు, ప్రజలను జ్ఞానవంతులుగాను, ధార్మికులుగాను, విద్యావంతులుగాను, సంస్కారవంతులు గాను తీర్చిదిద్దాలని యజుర్వేద భావార్ధం.

# ధర్మానుష్ఠానము - వాని స్థితి

సంస్కృతి అనగా సంస్కరించునది. మనిషిని వున్నత భావాలు కలవానిగా, ఉన్నత ఆశయములు కలవానిగా, తనకు, సంఘానికి, ప్రపంచానికి తద్వారా జగత్తుకు శుభం జరగాలనేది మహర్షుల మనోభిష్టము. అభీష్టసిద్ధికై వారొనర్చిన తపోఫలితమే పరమేశ్వరుడు అనుగ్రహించిన వేదములు. అగ్ని, వాయువు, ఆదిత్య, అంగిర అను నలుగురు శుద్ధఅంతఃకరణులైన ఋషుల హృదయములలో భాసిల్లిన బీజాక్షరాలు. వేదోక్త కర్మల ద్వారా మనిషిని సంస్కరించే క్రియాకలాపమే వైదిక సంస్కృతి. అది మనిషి మనిషికి మారదు. మతాలకు అతీతమైనది. సార్వజనీనమైనది.

**"వేదోఖిలో ధర్మ మూలమ్ స్మృతిశీలే చతద్విదామ్**
**ఆచారా శ్చైవ సాధూనామ్ ఆత్మనస్తుష్టిరేవచ" ॥మను॥**

సమస్త ధర్మములకు మూలము వేదము. మానవుడు సదాచారుడై, నియమ పాలకుడై వర్తించాలి. సమస్త ధర్మములకు మూలము వేదములయినట్లే, సదాచారుల ఆచార వ్యవహారాలు కూడా ధర్మమునకు మూలము అని మను ధర్మశాస్త్రము చెప్తుంది.

మానవుడు వేదోక్త ధర్మములను విచారిస్తూ, సత్పురుషుల ఆచారమును, ఆత్మ ప్రసన్నమగు కర్మలను విధిగా విశ్లేషించుకోవాలి. భయము కాని, శంక కానీ, సిగ్గు కానీ కలుగని కర్మలు మాత్రమే చేయాలి. అబద్ధము చెప్పుటకు దొంగతనం చేయుటకు కోరిక కలిగినపుడే, ఆత్మయందు భయము, సిగ్గు ఇత్యాది గుణములు ఉత్పన్నమవుతాయి. కావున అట్టి పనులు చేయరాదు. ధర్మాన్ని గురించి చెప్తూ వైశేషిక దర్శనములో కణాద మహర్షి చెప్తాడు.

**"యతో అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధిః సధర్మః"** ॥వై॥ద॥

ఏ కర్మను ఆచరించినందు వలన అభ్యుదయము, మోక్షము వ్యవహారిక ఉత్తమ సుఖప్రాప్తి లభిస్తుందో అదియే ధర్మము.

సృష్టిలోని పదార్ధములకు ఏ గుణములు కలిగివున్న దాని ఉనికి వుండునో అది ఆ పదార్ధము యొక్క ధర్మము. ఉదాహరణకు అగ్నియొక్క ధర్మము ఉష్ణము, ప్రకాశము. ఈ రెండు గుణములలో ఏ ఒకటి లేకపోయినా, లేక రెండూ లేకపోయినా అది అగ్ని అనబడదు. అనగా అగ్ని తన గౌరవమును కోల్పోవును. అట్లే సదాచారమును, సద్గుణములను కోల్పోయిన వ్యక్తిని 'మానవుడు' అనతగదు. మానవులు ఎల్లప్పుడూ ధైర్యము కలిగి వుండాలి. సత్కర్మలు చేయటానికై కావలసినది ధైర్యము. అందుకే 'ధృతి' అనగా ధైర్యమును ముందు ప్రతిపాదించాడు మహర్షి మనువు.

**"ధృతి క్షమ దమో స్తేయం శౌచ మింద్రియ నిగ్రహం**
**ధీః విద్యా సత్యమక్రోధో దశకం ధర్మలక్షణం"** ॥మను॥

ద్వంద్వసహనం అలవరచుకోవాలి. అనగా నింద, స్తుతులు ఈ రెండింటి యందు సమదృష్టి కలిగి ఉండాలి. సుఖము, దుఃఖమును సమముగానే అనుభవించాలి. ఇంద్రియములను అధర్మకార్యములందు పోనీక, ఎల్లప్పుడు ధర్మకార్యములందు మాత్రమే ప్రవేశపెట్టాలి.

పరుల వస్తువును గ్రహించటానికి ప్రయత్నించరాదు. శరీరాన్ని ఆత్మను ఎప్పుడూ పవిత్రంగా వుంచాలి, బ్రహ్మచర్యాన్ని పాలించాలి. బుద్ధితో ఆలోచించి సత్యాన్ని, అసత్యాన్ని తెలుసుకోవాలి. ప్రతి పదార్ధము యొక్క యదార్థస్థితిని విశ్లేషించుకోవాలి. సత్యమును మాత్రమే ఆడాలి. కోపాన్ని విడిచి పెట్టాలి. ఈ పది గుణములు ధర్మలక్షణములని మను ధర్మశాస్త్రము చెప్తుంది.

ఈ శరీరం ఎంతకాలము రోగము లేనిదై వుంటుందో అంతకాలము తనకు, సమాజానికి మేలు కలిగించే కర్మలు మాత్రమే ఆచరించాలి. మనిషి మరణించిన తరువాత ఇకచేయటానికి ఏమీ వుండదు.

మానవునికి, జంతువులకు కొన్ని విషయములలో సారూప్యముంది. ఆహారాన్ని సంపాదించుటలోనూ, తినుటలోనూ, నిద్రపోవుటలోనూ, తనకన్నా పెద్దప్రాణిని చూసినపుడు భయంలోనూ, ఇంకా సంతానాన్ని వృద్ధిచేయుటలోనూ ఇద్దరూ ఒక్కటే కానీ ఈ ఇద్దరినీ వేరుచేసేది ధర్మగుణము ఒక్కటే. అదే విషయాన్ని జగద్గురు ఆదిశంకరులు చెప్తారు.

**"ఆహార నిద్రాభయ మైధూనాని సామాన్యమేతత్ పశుభిః నరాణామ్**
**ధర్మహితేషాం అధికో విశేషః ధర్మేణహీనా పశుభిః సమానామ్"**
**॥వి॥చూ॥**

అంటే ధర్మాన్ని ఆచరించని వారు పశుతుల్యులని భావము. ధర్మాన్ని ఆచరించే వ్యక్తులు నిత్యం వారి ప్రార్థనలో భగవంతుని ఒక్కటే కోరుకోవాలి.

**అసతోమా సద్గమయా,**
**తమసోమా జ్యోతిర్గమయా,**
**మృత్యోర్మా అమృతంగమయా,**
ఇవి బ్రాహ్మణ వచనములు.

ఓ పరమేశ్వరా ! మమ్ములను అసన్మార్గము నుండి దూరం చేసి, సన్మార్గము నందు ప్రవేశపెట్టుము. ఓ పరమేశ్వరా ! మమ్ములను అవిద్యాంధకార అజ్ఞానము నుండి దూరము చేసి, విద్యారూప సూర్యుని పొందచేయుము.

ఓ పరమేశ్వరా ! మృత్యువనెడి అభినివేశక్లేశము నుండి దూరము చేసి, అమృతతత్వమును ప్రసాదింపుము. మానవులందరూ, ఎవరు దేనికొరకు ప్రార్థిస్తారో వారు ఆవిధముగానే వర్తించాలి. సర్వోత్తమ బుద్ధి కొరకు, సర్వోత్తమ గుణయుక్తుడగు పరమేశ్వరుని నిత్యము చింతనచేసి, దానికొరకు శక్తి కొలది ప్రయత్నించాలి. ఈ గుణములు ఎవరు ఎంత ఎక్కువగా కలిగివున్న అతడంత ధర్మాత్ముడగును. ఈ గుణములకు ఎంతదూరమైన అంత అధర్మాత్ముడగును.

ఈ గుణముల ప్రపంచములో ఏ వ్యక్తియైనా స్వీకరించవచ్చును. స్త్రీలు, పురుషులు అందరూ అనుసరించదగిన ఈ ధర్మములు అంగీకరించిననాడు ప్రపంచములో పెరుగుతున్న జాతి, మత, వర్గ విరోధములు పోయి మానవ జీవితము సుఖప్రమవుతుంది. ప్రతి వ్యక్తి కూడా స్థితప్రజ్ఞుడై, ధర్మము నందు దృఢ సంకల్పము కలిగినవాడై వుండాలి. ప్రపంచములో ప్రతి పదార్థము యొక్క యదార్థ స్వరూపమును గుర్తించాలి.

అనగా జడమును జగముగనూ, చేతన పదార్థమును చేతనముగనూ గుర్తించాలి. అంతే కాకుండా ప్రతి పదార్థమును యథాయోగ్యముగా వుపయో గించుకోవాలి.

అంతేకానీ మూఢత్వానికిపోయి, విపరీతముగా ఆలోచించి వివేకశూన్యులు కాకూడదు. వేదము, ఈశ్వరుడు, ముక్తి, ధర్మము, విద్య, సత్సంగము మొదలగు గుణములు కలిగి వుండాలి. పరమేశ్వరునిచే సమస్త మానవాళి కొరకు ఏర్పరిచిన ఈ భారతీయ వేద సంస్కృతి మనస్ఫూర్తిగా, బుద్ధిపూర్వకముగా గ్రహించిన వాని స్థితి మొదట కొంచెము కఠినముగా తోచిననూ, తరువాత అతనికి వ్యక్తిగతమగు ఆనందమును, సుఖ శాంతులను పొందచేయును. నిరాశ, నిస్పృహ మొదలగు వానికి ఈ మార్గములో చోటు వుండదు.

ఇంకా ఈ ధర్మములు అనుసరించిన వానికి సాంఘీక భావము, భాతృభావము వృద్ధి పొందుతాయి. అతని ఆలోచన నిర్మలము, పవిత్రము అవుతుంది. సంకల్పము శుద్ధమవుతుంది. కాబట్టి ప్రతి వ్యక్తి తనయొక్కయు, సమిష్టియొక్కయు శుభము, సుఖము, ఆనందము, సంతోషము, ఆరోగ్యము కొరకు వేద ధర్మములను ఆచరించుటయే కర్తవ్యముగా భావించాలి. భావి భారత భాగ్యోదయానికి నాంది పలకాలి.

**శంఇతిఓ3మ్**

# ధర్మ సాధనము

**కుర్వన్నే వేహ కర్మాణి జిజీవిషేత్ శతంసమా**
**ఏవంత్వయి నాన్యథేతోస్తి నకర్మలిప్యతేనరే ॥యజు॥**

ఫలాపేక్ష లేక నూరేండ్ల పర్యంతము కర్మలనాచరింపుము. ఇట్టి కర్మలు బంధన హేతువులు కావు అని అర్థము. మానవులుగా శరీరాన్ని పొందిన తరువాత అతను ఆచరించవలసిన ధర్మాలు సాధించాలి. అపుడే అతను మానవునిగా పుట్టినట్టు.

చిన్న వుదాహరణ మన ఇంట్లో ఆడవాళ్ళు 'హమ్మయ్య ఈ పూట వంట పూర్తయింది' అంటారు. వంట పూర్తవటమంటే, ఆ వండిన పదార్థములు కుటుంబంలో అందరూ తృప్తిగా తిని, త్రేన్చినపుడే అది పూర్తయినట్టు. లేకపోతే అది కానట్లే అలాగే మానవుడు ఈ శరీరాన్ని ధరించిన వెంటనే పుట్టినట్టు కాదు. శరీర సాధనముతో అతను ఆచరించ వలసిన పురుషార్థాలు ఆచరించినపుడే అతను పుట్టినట్టు. అవి నూరేండ్ల పర్యంతము ఆచరించాలి. అలా ఆచరించి చివరకు ఈ శరీరాన్ని విసర్జించి నపుడే అతను పుట్టినట్టు. అందుకే గోతమ మహర్షి న్యాయదర్శనములో చెప్తాడు.

**పునరుత్పత్తిః ప్రేత్యభావః**

మరణించటమంటే తిరిగి జన్మించటమే. ఫలాపేక్ష లేని కర్మలు మనల్ని బంధనంలోకి పడనివ్వవు. అంటే ఫలాపేక్షలేని కర్మల సంస్కారములు మన హృదయము మీద వుండవు కాబట్టి తిరిగి జన్మించే ఆస్కారమేలేదు. ఆవిధంగా మనం జన్మమరణముల బంధం నుండి తప్పించుకోవచ్చు. అందుకే వేదంలో ఫలాపేక్షలేని కర్మలు ఆచరించి మృత్యువు నుంచి తరించమని చెప్పబడింది.

అర్జునుడు తన క్షాత్ర ధర్మాన్ని విస్మరించి, మోహంలో వుండటం గ్రహించి శ్రీకృష్ణుడు బోధించిన గీతాశాస్త్రమంతా పై వేదమంత్ర సారమే. అదే నిష్కామకర్మ సిద్ధాంతము.

శంఇతిఓ3మ్

**ఓం ఆ రాష్ట్రే రాజన్యః శూర ఇషవ్యో**
**అతివ్యాధీ మహారథో జాయతాం**

**(యజుర్వేదం)**

**భావార్ధము :**

క్షత్రియులు, క్షాత్రధర్మంతో, శౌర్య, ధైర్య, సాహసాది శుభ గుణములు కలిగి, శస్త్ర, అస్త్ర యుద్ధవిద్యాలలో నైపుణ్యాన్ని సంపాదించి అతిరథ మహారథులై నిరంతరం దేశాన్ని రక్షించి శత్రువుల నుండి ప్రజలను అనుక్షణం కాపాడుతూ వుండాలి.

# ఇంద్రియ నిగ్రహము

మానవునకు వుండవలసిన ముఖ్యలక్షణము ఇంద్రియనిగ్రహము. మను ధర్మశాస్త్రములో ధర్మలక్షణములు చెప్తూ దీనిని ప్రత్యేకంగా ప్రస్తావించటం జరిగింది.

**ధృతి క్షమదమోస్తేయం శౌచమింద్రియ నిగ్రహమ్**
**ధీర్విద్యాసత్యమక్రోధోదశకం ధర్మలక్షణమ్** ॥మను॥

ఆత్మకు సుఖసాధనములగుట వలన వీనికి యింద్రియములని పేరు. ఇంద్రియ నిగ్రహమనగా, ఇంద్రియములను విషయముల వెంట పోనీక, మంచిమార్గమున మాత్రమే ప్రవేశపెడ్తూ, అధర్మ ప్రవృత్తిని నిరోధించుట. విషయాసక్తిచే ఇంద్రియములను అధర్మమార్గముల యందు నడుపుట వలన మనుష్యుడు దోషపూరితడవుతున్నాడు. ఎవరు వానిని జయించి ధర్మమార్గమున నడుపుదురో వారు అభీష్ట సిద్ధులను పొందుతారని శాస్త్రము చెప్తున్నది.

మానవుడు తన అవయవములన్నింటినీ పుష్టిగా, శక్తివంతంగా వుండునట్లు ప్రవర్తించాలి. శుక్లపక్ష చంద్రుడు ఏవిధంగా దినదిన ప్రవర్థమానమై ప్రకాశిస్తాడో, ఆవిధముగనే యువకులు దినదినాభివృద్ధి చెందాలని వేదంలో చెప్పబడింది. ఇంద్రియములను నిగ్రహించి మనసును అదుపులో వుంచుకొనుటకు బ్రహ్మచర్యము చాలా అవసరమని సుశ్రుత మహర్షి ఆయుర్వేదశాస్త్రం చెప్తున్నది.

**యధాపయసినర్పిస్తు గుడశ్చ యిక్షురసేయధా**
**ఏవం హిసగ లేకాయ శుక్రం తిష్టతిదేహీనామ్** ॥ఆ.శా॥

పాలయందు వెన్న, చెరకురసమందు బెల్లము ఏవిధముగా నిక్షిప్తమై వున్నదో, ఆవిధముగనే సర్వశరీరము నందు వీర్యము ఓజస్సు రూపములో

నిక్షిప్తమై వున్నది. పాలనుండి వెన్నను తీయుటకు పాలను మధింపవలసియు, చెరకు నుండి బెల్లము తీయుటకు చెరకును పిండవలసియూన్నదో, అట్లే శరీరము నుండి ఒక బిందువు వీర్యమును వెలువరించుటకు సర్వశరీరమును మధింప వలసి యున్నది. వెన్నతీసిన పిదప పాలు, చెరకురసం తీసిన పిదప చెరకు ఎట్లు సారహీనమగునో, వీర్యరహిత శరీరము కూడా సారహీనమై, నిర్వీర్యమై నామమాత్ర మగుచున్నది. శరీరమందలి నాడీమండలము బలహీనమై, ప్రతి అవయవము నందు నిరుత్సాహము ప్రబలుతుంది అని సుశ్రుత మహర్షి ఆయుర్వేద శాస్త్రము చెప్తున్నది. వీర్యపతనము నందు మానవుని పతనము, వీర్యధారణ యందు మానవుని జీవనము వున్నట్లు శివ పురాణము కూడా చెప్తున్నది.

**మరణం బిందుపాతేన జీవనమ్ బిందుధారణమ్**
**తస్మాదతి ప్రయత్నేన కురుతే బిందుధారణమ్**

వీర్య నష్టము వలన మానవుడు మృత్యువుకు చేరువవుతాడు. వీర్య రక్షణ వలన మానవుడు జీవితానికి చేరువవుతాడు. పరమేశ్వరుడు తన బ్రహ్మచర్య దీక్షాబలము వలననే, హాలాహలమును గరళమున నిలుపుకొనగలిగాడు అని స్వయంగా తానే శివపురాణంలో చెప్పుకోవటం జరిగింది.

బ్రహ్మచర్యాన్ని సాధించటం సులభం కాకపోయినా అసాధ్యం మాత్రం కాదు. నిత్యం వ్యాయామం చేస్తూ, ప్రాణాయామాది యోగాభ్యాస క్రియలు చేస్తూ, సత్పురుషులతో సహవాసము, సాత్వికాహారము వలననూ సాధించవచ్చు. ఇంద్రియములను మనస్సును వుత్తేజపరించే దృశ్యాలకు, సినిమాలకు దూరంగా వుండాలి.

ప్రజ్ఞానవంతుడు, కర్మశీలుడైన మానవుడు ధర్మపధాన్ని అనుసరిస్తూ, తన జీవితాన్ని సార్ధకత చేసుకోవాలి. మహాపురుషుడైన శ్రీకృష్ణుడు బ్రహ్మచర్య వ్రతమును పాలించి యోగీశ్వరుడయ్యాడు. అతని గుణ కర్మ స్వభావములు మనకు మార్గదర్శకములు. శ్రీకృష్ణుని యదార్ధ చరిత్ర మనకు మహాభారత

మందు చూడవచ్చు. శ్రీకృష్ణుడు పుట్టినది మొదలు గిట్టినదాకా ఒక్క అధర్మకార్యమైనా చేయలేదు. అతనికి ఒకే ఒక భార్య రుక్మిణి. పరిస్థితుల ప్రాబల్యం వలన ఇంకనూ బ్రహ్మచర్యమును పాలించ తలంచుచుండగా, రుక్మిణిని వివాహము చేసుకొనవలసి వచ్చినది. యోగ్యురాలైన రుక్మిణికి నచ్చచెప్పి బదరికాశ్రమములో ఇరువురూ పన్నెండు సంవత్సరములు బ్రహ్మచర్యదీక్ష పాలించి యోగాభ్యాసం చేసారని, దీనికి సంబంధించిన వర్ణన మనకు, మహాభారతము సౌప్తిక పర్వము నందు కనిపిస్తుంది. శ్రీకృష్ణుడు గృహస్థుడై వుండి బ్రహ్మచర్యమును పాలించి 120 సం॥లు జీవించినట్లు చరిత్ర చెప్తుంది.

మనం పాపములు చేయకుండా వుండాలంటే, శరీరం దోషరహితంగా వుండాలంటే బలవంతులము కావాలి. బలవంతుడు, శక్తివంతుడు పాపకార్యము లకు దూరంగా వుండగలడు. బలహీనులు అట్లు చేయలేరు. మానవులు ఎంతగా ఆరోగ్యవంతులవుతారో అంతగా పురుషార్థములు చేయగలుగుతారు. శరీరము సహకరించకపోతే, ఎంత జిజ్ఞాసువు అయినప్పటికీ పురుషార్థములు చేయలేరు. ధర్మ సంతానమును పొందుటకు మాత్రమే వివాహము పేర్కొనబడినది. వివాహ మనునది నియమపాలన కొరకు కానీ, స్వేచ్ఛా విహారము కొరకు కాదు. పత్ని విలాసవస్తువూ కాదు. వివాహ సమయంలో వధూవరులు అగ్నిహోత్ర సమక్షంలో చేసే ప్రతిజ్ఞను ఒకసారి అవలోకించాలి.

**"గృభ్ణామితే సౌభగత్వాయ హస్తం మయాపత్యా**
**జరదష్టిర్య ధాసహ భగో ఆర్యమా"**

ఓ కళ్యాణీ ! నేనుకాంతినీ, సంపదనూ, ధర్మపరిపూర్ణతనూ సాధించుట కొరకు నిన్ను గ్రహించుచున్నాను అని ప్రతిజ్ఞ చేస్తారు. వివాహము యొక్క వుద్దేశ్యము, సార్థకత మనము గ్రహించినచో మానవుని గృహస్థ జీవితము నందనోద్యానమవుతుంది.

విద్యార్థి దశలో ఇంద్రియ నిగ్రహము పాటింపనిచో వివాహము తరువాత వారు బలిష్ఠులు, మేధావంతులైన సంతానమును పొందలేరు.

కేవలం బ్రహ్మచర్య దీక్ష వలననే ధర్మాధర్మవిచక్షణ గ్రహింపు సామర్థ్యం లభిస్తుంది. కావున మానవులెల్లరూ దీర్ఘయువు పొందటానికి బ్రహ్మచర్యము పాటిస్తూ, ఆసనములు యోగాభ్యాసాదిక్రియలు చేస్తూ, సాత్వికాహారము తీసికొంటూ మృత్యువును జయించవలెను.

**"మా పురా జరాసా మృధాః"**

అనగా ఓ మానవుడా ! వృద్ధాప్యము రాకమునుపే నీవు మరణించ వలదు. అన్న వేదవాక్యము సార్ధకము కావాలి.

శంఇతిఓ3మ్

**పురన్ధిర్యోషా జిష్ణూ రథేష్ఠాః**

**(యజుర్వేదం)**

**భావార్ధము :**

సర్వవిధములా ! సౌభాగ్యవంతమైన దేశంలో స్త్రీలు, బహుముఖ ప్రజ్ఞావంతులై, ప్రతిభావంతులై, సంస్కారవంతులైనవారు కావాలి. వారు విద్యావంతులై, సమర్ధతతో, దక్షతతో కుటుంబాన్ని, సమాజాన్ని నడిపించేవారు కావాలి.

**యస్య పుత్రో వశీభూతో భార్యా ఛందానుగామినీ!**
**విభవే యశ్చ సంతుష్ట స్తస్య స్వర్గ ఇహైవ హి॥**

**(చా॥నీ)**

**భావార్ధము :**

ఎవరికి పుత్రుడు వశమందుండునో, ఎవని భార్య అతని ఇచ్ఛానుసారము వర్తించునో, ఎవడు తన సంపదచే తృప్తి చెందునో అట్టివానికి ఈ భూమండలమే స్వర్గము.

# బ్రహ్మాచర్య మహిమ

సృష్టిలో మానవ జీవితమునకు ఎంతో ప్రాముఖ్యత వున్నది. ఆ ప్రత్యేకతను అవగాహన చేసికొననిదే జీవితాన్ని సక్రమముగా సాగింప సాధ్యం కాదు. జన్మ చరితార్థము కాదు. ఇహపరములయందు ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని పొందుటకు అనువగు దివ్య జీవితమును గడుపుటకై రూపొందించబడిన దివ్యప్రణాళిక మానవజన్మ. జీవిత పరమలక్ష్యమేమిటో అది సిద్ధించుటకు ఏవిధంగా వర్తించాలో స్వయంగా సమగ్రంగా గ్రహించి సక్రమంగా అనుసరించినపుడే పురోగమనం, ఆశయసిద్ధి. అటువంటి విలక్షణ వ్యక్తిత్వం కోసం పతంజలి మహర్షి చెప్పిన యోగసూత్రములలో బ్రహ్మచర్యవ్రతం అతిప్రాముఖ్యమైనది.

ఈ బ్రహ్మచర్యవ్రతం గురించి వేదాలు ఎంతగానో ప్రశంసించాయి. ఏ దేశమందు బాలబాలికలకు బ్రహ్మచర్య పాలన అనివార్యమైయున్నదో, బ్రహ్మచర్యమే అధిష్టానమై యున్నదో ఆ దేశము భారతదేశము. అట్టి భారతజాతి సమున్నతికై మహర్షులు ప్రసాదించిన మహోన్నతవరం చతుర్విధ ఆశ్రమములు. అందులో మొదటిది బ్రహ్మచర్యాశ్రమము. మానవులు ధర్మాత్ములై, పురుషార్థములు సాధించాలంటే, శరీరమేకాదు ప్రతి ఇంద్రియం కూడా శక్తివంతమైనది కావాలి. మన శరీరం, ఇంద్రియములు ఆరోగ్యంగా, బలంగా వుండాలంటే ఏమి చేయాలో ఈ అధర్వవేదమంత్రం చెప్తోంది.

**యధా బధ్నన్ దాక్షాయణా హిరణ్యం**
**శతానీకాయ సుమనస్యమానాః**
**తత్తే బధ్నామ్యాయుషే వర్చసే**
**బలాయ దీర్ఘాయుత్వాయ శతశారదాయ** ॥అధర్వ॥

బలం, వృద్ధికావాలని తలచేవారు, శుభసంకల్పము కలవారు, వందలకొలది సేనల బలాన్ని కాంక్షించేవారు. వీర్యధారణ చేసారు. అనగా మానవులు శక్తివంతులు కావాలంటే ఊర్ధ్వరేతస్కులు కావాలి. ఆ శక్తిని దీర్ఘాయువు కొరకు, తేజస్సు కొరకు పరమేశ్వరుడు మనయందు స్థాపించడం జరిగినది.

ఏ దేశమందు 5 సం॥ల ప్రాయంలోనే బాలలు సింహములతో ఆటలాడు కొన్నారో, ఏ దేశబాలల పదఘాతముచే పర్వతములు సైతం చూర్ణములు అయినవో, నాటి శ్రీరాముడు మొదలుకొని నేటి గాంధి మహాత్ముడు దాకా ఎందరో మహానుభావులు, మహాపురుషులు జన్మించి వీర్యవంతమైన దేశం నేడు నిర్వీర్యమై, నిస్తేజంగా మారుతోంది. లక్షలాది యువకులు మీడియా మత్తులో మునిగి, బలహీనపడి, బహుదుర్వ్యాధులచే పీడింపబడి, తమ కుటుంబ సభ్యులను సైతం నిరాధారులను గావిస్తున్నారు. సాధన, నియమములు, సంయమనము లోపించుటచే దైవత్వాన్ని పొందవలసిన మానవత్వం పతనావస్థలో వుంది. ఇట్టి దశ పునఃబ్రహ్మచర్య ప్రతిష్టాదీక్ష వలననే సముద్ధరింపబడగదలని మనకు వేదాలు చెప్తున్నాయి. బ్రహ్మచర్యక్షీణతయే ఆయుక్షీణతకు కారణమని సుశ్రుత మహర్షి ఆయుర్వేదశాస్త్రములో స్పష్టం చేయటం జరిగినది. శుక్రోత్పత్తి ముందుగా మనకు తెలియాలి. సప్తధాతువుల సమ్మేళనము ఈ శరీరము.

**రసాద్రక్తం తతో మామ్సాన్మేధః ప్రజాయతే**
**మేధసో స్థితతో మజ్జా, మజ్జయాః శుక్రసంమ్భవః ॥ఆ.శా॥**

ఆహారము ప్రధమమున రసముగామారి, పిదప రక్తము, తరువాత మాంసముగను, అటు పిమ్మట మేధస్సుగనూ మారి మేధస్సు నుంచి ఎముక, ఎముక నుంచి మజ్జ, చివరగా శుక్రముగా మారుతుంది. ఆ శుక్రమే ఓజో రూపముతో మహాతేజస్సుగా మారి సర్వశరీరమందు ప్రకాశించుచున్నది. ఇదియే జీవనాధారము. ఈ పదార్ధములన్నీ శరీరమును ధరించి వున్నవి కావున వీనికి ధాతువులని పేరు.

**శుక్రం సౌమ్యం స్థితం స్నిగ్ధం బలపుష్టికరమ్ స్మృతమ్**
**గర్భబీజంవపుః సారోజీవనాశ్రయుత్తమః ॥ఆ।శా॥**

శుక్రము సౌమ్యమై, శ్వేతమై, స్నిగ్ధమై, బలవర్ధకమై, గర్భబీజమై, శరీర శ్రేష్ఠ సారమై జీవితమునకు ప్రధాన ఆశ్రయమయి వెలయచున్నది. కావున యువకులు ఇంద్రియములను, విషయములవెంట పోనీక, నిగ్రహించి, ప్రాణాయామ, యోగాభ్యాసాదులచే ఊర్ధ్వరేతస్కులు కావాలి. ఎందుకు ఈ బ్రహ్మచర్యాన్ని అవలంబించాలి అన్నదానికి వేదము యొక్క సమాధానం

**"బ్రహ్మచర్యేణ తపసాదేవా మృత్యుముపాఘ్నతా" ॥అధర్వ॥**

బ్రహ్మచర్యాన్ని అవలంబించినవారు, శారీరక, ఆత్మిక బలాన్ని సంపాదించి, సత్కర్మలు ఆచరించి మృత్యువును సైతం జయించగలరు. భీష్ముని యొక్క బ్రహ్మచర్య దీక్షాబలము, హనుమంతుని వీరప్రతాపము ఇందుకు తార్కాణము.

ప్రకాశవంతమైన పరమాత్మను, వేదాన్ని, జ్ఞానాన్ని బ్రహ్మచారి తన హృదయంలో స్థాపించుకొంటాడు.

**నజాతుకామః కామానాం ఉపభోగేన శామ్యతి**
**హవిషా కృష్ణవర్త్మేన భూయ ఏ వా భివర్ధతే ॥మను॥**

కామములు భోగించుట వలన కోరికలు వర్ధిల్లునే గాని శాంతింపవు అని మను ధర్మశాస్త్రము. ఇంద్రియ నిగ్రహమునకు వివేకజ్ఞానము అవసరము. ప్రమిదలోని దీపము చమురుతో ఏవిధముగా ప్రకాశిస్తుందో ఆవిధముగనే శుక్రమనే శక్తివంతమైన పదార్థము వలన శరీరములోని ఆత్మ ప్రకాశిస్తుంది. కావున రధసారధి రధమును నడిపినట్లే మానవులు ముఖ్యంగా యువకులు తమ ఆజ్ఞమేరకు బుద్ధి అనే కళ్ళెముతో గుర్రములనే ఇంద్రియములను నిగ్రహించి బ్రహ్మచర్యమును కాపాడుకొనుచు దేశభవితకు పునాదిరాళ్ళు కావాలి.

శంఇతిఓ౩మ్

# మాతృదేవోభవ

### "మాన్యతే పూజ్యతే యా సా మాతా"

అనగా పూజింపబడునది, గౌరవింపబడునది తల్లి. 'మఞమానేశబ్దేచ' అను ధాతువు నుండి మాతృశబ్దము వుత్పన్నమవుతుంది.

### "యా మిమీతే మానయతి వ సర్వాన్ పుత్రాన్ మాతా"

సంపూర్ణ దయ కల్గిన తల్లి తన సంతానమునకు సుఖమును, వున్నతిని కోరుతుంది. అందువలన ఆమెకు 'మాతా' అని పేరు. ప్రాచీన ఋషుల తల్లిని ప్రథమ దేవతగా పేర్కొన్నారు. దేవత అనగా దివ్య గుణములు కలిగినది. అనగా తన శారీరక, మానసిక, ఆత్మిక శక్తులను ఇతరుల ప్రయోజనము కోసము వినియోగించుట. తల్లి తన సర్వశక్తులను బిడ్డల యోగక్షేమములకై వినియోగించును కావున ప్రథమ దేవత గానే కాక, పరమేశ్వరునితో సమానముగా కూడా పేర్కొన్నది వేదము.

**వస్యామ్ ఇంద్రాసీ మే పితరుత భ్రాతుః అభుంజితా**
**మాతా చ మే చ దయధః సమావసో**
**వసుత్యనా య రాధసే**

ఓ పరమేశ్వరా ! నీవు నన్ను పాలించు తండ్రి కన్ననూ, పాలింపని అన్నదమ్ముల కన్ననూ గొప్పవాడవు. కానీ నా తల్లితో పోల్చిన, నీవు ఆమెకు సమానుడవుగానే కనిపించుచున్నావు. ఎందుకనగా మీరిద్దరూ నాకు శరీరము నిచ్చి, ఐశ్వర్యాదుల నిచ్చి ఆదరించారు. ఇద్దరూ నా వున్నతిని కోరుచున్నారు. మీ ఇద్దరిలో బేధమేమున్నది. అటువంటి మహాత్మురాలైన తల్లిని, కనులారా దర్శించి, మనసారా సేవించి తరించుట మానవుని ప్రథమ కర్తవ్యము.

**"మాతా నిర్మాతాభవతి"** **॥యజు॥**

బిడ్డలను పాలించి పోషించి యోగ్యులుగానూ, వుత్తములు గానూ, సంస్కార వంతులుగానూ, సంస్కృతీ పరిరక్షణలో భాగస్వామ్యులుగా నిర్మాణము చేయుట ద్వారా ఆమె వుత్తమరాలగుచున్నది. అతి ప్రసన్నురాలై, కుటుంబ వ్యవహారము లందు చతురురాలై, పదార్ధములను సంస్కరించుచూ, ఇంటిని పవిత్రముగా వుంచుతుంది తల్లి.

**ఉపాధ్యాయాన్ దశాచార్యః ఆచార్యాణం శతం పితా**
**సహస్రంతు పిత్రూన్ మాతా గౌరవేణా తిరిత్యతతే ॥మను॥**

పదిమంది వుపాధ్యాయుల కంటే ఒక్క ఆచార్యుడు వందమంది ఆచార్యుల కంటే ఒక్క తండ్రి, వేయిమంది తండ్రుల కంటే ఒక్క తల్లి అధికురాలని మను ధర్మశాస్త్రము చెప్తోంది.

తల్లి, తండ్రి, ఆచార్యుడు; ఈ ముగ్గురు వలననే బిడ్డలు జ్ఞానవంతులగు చున్నారు. బిడ్డల సంస్కారములన్నీ కూడా ఆ తల్లి మనోభావములే. తల్లి నుండి బిడ్డలకు లభించు వుపదేశము, వుపకారము వేరెవరి నుండి లభించదు.

**"ప్రశస్తా ధార్మికీ మాతా విద్యతే యస్య స మాతృమాన్"**

పుట్టినప్పట్నుండి పుంసవనసంస్కారము మొదలుకొని, వివాహ సంస్కారము వరకు చేయించి ఆ బిడ్డలను యోగ్యులుగానూ, సంస్కారవంతులుగా తీర్చిదిద్దు తల్లి ధన్యురాలు అని విదుర నీతి చెప్తోంది.

సంతానమునకు సభ్యత లభించాలన్నా, శరీరముతో ఏ చెడు పనులు చేయకుండా వుండాలన్నా బిడ్డలు మొదటి అయిదు సంవత్సరములు తల్లి దగ్గర తర్ఫీధు పొందాలి. కొంచెం కొంచెంగా మాటలు ప్రారంభించినపుడు చిన్నవాళ్ళతో, పెద్దవాళ్ళతో, అధికారులతో, తండ్రితో, అతిధులతో ఎలా సంభాషించాలో నేర్పాలి.

బిడ్డలు జితేంద్రియములుగానూ, విద్యాప్రియులుగానూ సత్సంగము నందు అభిలాష కలుగునట్లు తల్లి ప్రయత్నించాలి. అతిలానము వలన

సంతానమునకు హాని కలుగుతుంది.

**సామృతైః పాణినీ ఖిర్ఘ్నంతి గురవో న విపోక్షి తైః**
**లాలనో(శయినోదోషాన్ తాడనా (శయినో గుణాః ॥పా॥వ్యా॥**

ఏ తల్లిదండ్రులు తమ బిడ్డలకు గానీ, ఆచార్యుడు తన శిష్యులకు గానీ క్రమశిక్షణలో నుంచుటకు దండించెదరో, ఆ తల్లిదండ్రులు తమ పిల్లలకు, ఆ ఆచార్యుడు తన శిష్యులకు అమృతము త్రాగించినవారవుతారు. గారబము వలన పిల్లలందుకానీ, శిష్యులందుకానీ దోషాలు ప్రాప్తిస్తాయి. అయితే తల్లిదండ్రులు, ఆచార్యులు పిల్లలను ఈర్ష్యాద్వేషములతో కొట్టరాదు. పైకి భయపెట్టిననూ లోపల కరుణాదృష్టితో వుండాలి.

వాల్మీకి రామాయణములో సుమిత్ర పుత్రుడైన లక్ష్మణునకు ఆదర్శ వ్యవహార కౌశలమును వుపయోగించి భారతీయ సంస్కృతీ పునాదులను దృఢపరిచింది. శ్రీరాముడు అరణ్యావాసమునకు పోవు సమయమున సుమిత్ర చెప్తుంది లక్ష్మణునితో

**రామం దశరథం విద్ధిమా విద్ధి జనకాత్మజం**
**అయోధ్యాం అటవీం విద్ధి గచ్ఛతాత యధా సుఖమ్**

ఓ లక్ష్మణా ! శ్రీరామచంద్రునే నీ తండ్రి దశరథుడిగా భావించు. సీతాదేవిని నాతో సమానముగా తల్లిగా భావించు. అడవినే అయోధ్యగా భావించి సుఖంగా వనానికి బయలుదేరునాయనా. ఈ సంస్కారోపదేశము వ్యవహార జ్ఞానమునకు ఆదరణీయ వుదాహరణ.

నిత్యము వృద్ధులైన తల్లిదండ్రులకు పాదాభివందనం చేసినచో ఆయుష్షు, విద్య, కీర్తి, బలము వృద్ధి చెందుతాయి. ఇట్టి ప్రత్యక్ష దేవతలైన తల్లిదండ్రుల యందు బిడ్డల కర్తవ్యము ఎంతో వుంది. తల్లిదండ్రులు సంస్కారముతో బిడ్డలకు వుత్తమ సంస్కారములను నేర్పించి భావి భారతజాతికి ఆదర్శవంతులైన పౌరులను అతిప్రయత్నముతో చేయుదురని, భగవంతుడు వారికి ఆశక్తిని ప్రసాదించమని ప్రార్థించెద.

శంఇతిఓ3మ్

# సభ్యత - సంస్కారము

సభ్యత అనగా ప్రకాశము అని అర్థము. ప్రకాశము ఎపడూ వ్యాపకమై వుంటుంది. ఆ ప్రకాశమునకు తైలమాధారము. అలాగే సభ్యత అనే జ్యోతికి సంస్కృతి అనే తైలమాధారము. ఆ తైలము ఎటువంటి దోషములేనిదై, సంస్కరింపబడి వుండాలి. శక్తివంతమై వుండాలి. అపుడే సభ్యత అవిరళముగా ప్రకాశిస్తుంది. చక్కని సభ్యత కోసం, సంస్కారయుక్తమైన వైదిక సంస్కృతి ప్రసాదించిన ఈ క్రింది మంత్రం పరిశీలిద్దాం.

**ఓ3మ్ తన్తుం తన్వన్ రజసో భాను మన్విహి**
**జ్యోతిష్మతః పథోరక్ష ధియా కృతాన్**
**అనుల్బణం వయత జోగువామ్ ఆపః**
**మనుర్భవ జనయా దైవ్యం జనమ్** ॥ఋగ్॥

మానవులు జ్ఞానతంతువులను చేయుచూ లోకపాలకుడైన సూర్యుని నియమ పాలనను అనుసరించాలి. బుద్ధి మరియు విజ్ఞానయుక్తమైన వేదమార్గమును అనుసరించుచు, ఆ సంస్కృతిని సదా రక్షించుకోవాలి. సత్యాన్ని మాత్రమే అనుసరిస్తూ, అసత్యాన్ని త్యజిస్తూ దివ్యగుణములు కలిగిన మానవులుగా తయారు కావాలి.

కర్తవ్యపాలనను బోధిస్తూ, మానవులందరూ కలసిమెలిసి వర్తించాలని ఒక మంత్రంలో చెప్తారు. ఒకరితో ఒకరు ప్రేమపూర్వకముగా వార్తాలాపములు చేసుకోవాలి. కలిసిమెలసి యోచన చేయాలి. ఆలోచనలో ఒక్కటిగా వుండాలి. ప్రాచీన విద్వాంసులు ఏవిధముగా పరమాత్మను వుపాసించారో అదే మార్గమును తప్పనిసరిగా అనుసరించమని వేదము చెప్తున్నది.

**సత్యం బ్రూయాత్ ప్రియంబ్రూయాత్**
**నబ్రూయాత్ సత్యమప్రియమ్**
**ప్రియంచ నానృతం బ్రూయాత్**
**ఏషధర్మః సనాతనః ॥మను॥**

సత్యమైన వాక్కులే ఆడాలి. అదియును ప్రియమైనదిగా వుండాలి. ఆత్మకు ప్రియమైనది కావాలి. అప్రియమైన సత్యమునుగానీ, ప్రియమైన అసత్యమును గానీ చెప్పరాదు. ఇతరులకు కష్టము కలిగించునది మాట్లాడకూడదు. అనగా గ్రుడ్డివానిని నీవు గ్రుడ్డివాడివి అనుట సత్యమైనను అతనికి దుఃఖము కలుగుతుంది. కావున అటువంటి సత్యమును చెప్పకూడదు. అలాగే ఇతరులకు సంతోషపరచుటకై అసత్యమును పలుకకూడదు. ముఖప్రీతికోసం తప్పుడు పనులు చేయువానిని సమర్థించుటకు మంచివారుగా పొగడరాదు.

ఒక సందర్భంలో విదురుడు, ధృతరాష్ట్రునితో ఈవిధంగా చెప్తాడు. లోకంలో ఇతరులను సంతోష పెట్టుటకు ప్రియమైన మాటలతో పొగిడేవారు చాలామంది వుంటారు. కానీ వినటానికి ప్రీతిగా లేని మంచి మాటలు చెప్పువారు చాలా అరుదుగా వుంటారు. అలాగే చెప్పేవారున్ననూ వారి మాటలను వినేవారు కూడా తక్కువగానే వుంటారు.

మంచివారెప్పుడూ ఇతరుల దోషములను వారి ఎదురుగా చెప్పాలి. అలాగే ఇతరులు తమ దోషములను చెప్పినచో వినుటకు సిద్ధంగా వుండాలి. సభ్యత – సంస్కారముల కొరకు సత్సంగము కూడా ఒక అంగమే అవుతుందని భర్తృహరి చెప్తాడు.

**"సత్సంగతిః కథయ కి న కరోతి పుంసామ్**
**సాధు సంగంబు సకలార్థ సాధనంబు"**

సత్య, శాస్త్రానుయాయుల, వుత్తమ విద్వాంసుల ధార్మిక పురుషుల సన్నిధిని చేరి వారి సాంగత్యము ద్వారా జ్ఞానాన్ని పొందుట, వేదశాస్త్రముల స్వాధ్యాయము చేయుట, దుస్సాంగత్యమునకు దూరముగా వుండుట సత్సంగమనబడును.

పరమేశ్వరునిచే ప్రసాదించబడిన ఈ మానవదేహము సృష్టిలో సకల జీవరాసుల్నింటిలో కన్నా వున్నతమైనది. మనకు లభించిన ఈ జన్మలోనే వుత్తమకర్మ లాచరించి, దైవత్వమును పొందాలి. సజ్జన పురుషులతో స్నేహము చేయటం, ధార్మికులైన విద్వాంసుల వుపదేశములను శ్రద్ధగా విని, వాని ఆచరణమునకు ప్రయత్నము చేయుట, వేదాది సత్యశాస్త్రములందు విశ్వాస ముంచుట, సదాచారము మొదలగు సాధనములన్నీ కూడా సత్సంగానికి అంగములని మహర్షులు చెప్తారు.

**సత్సంగత్వే నిస్సంగత్వం నిస్సంగత్వే నిర్మోహత్వం**
**నిర్మోహత్వే నిశ్చలతత్వం నిశ్చలతత్వే జీవన్ముక్తిః** ॥వి॥చూ॥

సత్సంగము ద్వారా జ్ఞానవంతులైనవారు, సాంసారిక విషయములందు చిక్కుకొనక నిస్సంగుడగుచున్నాడు. ఎపుడైతే విషయములందు చిక్కుకొనకుండా వుంటాడో మోహమనేది దూరమై మనస్సు అదుపులో వుంటుంది. తద్వారా బుద్ధి స్థిరత్వము కలుగుతుంది. బుద్ధి స్థిరత్వం కలుగగానే మానవులు దోషముల నుండి దూరమై ముక్తిని పొందుతారని ఆదిశంకరులు చెప్తారు.

ఒకసారి విష్ణుమూర్తి, బలిచక్రవర్తితో సజ్జనులతో కలసి నరకానికి వెళతావా! దుర్జనులతో కూడి స్వర్గానికి వెళతావా! అని అడిగాడట. దానికి బలిచక్రవర్తి 'మహానుభావా! నేను సజ్జనులతో కలసి నరకానికి వెళ్తాను' అని చెప్పాడట. ఎందుకంటే సజ్జనులు వెళ్ళినచోట అది నరమైననూ వారు దానిని స్వర్గముగా మారుస్తారు. శతాధికగుణయుక్తమైన పాలు, కొంచెం మజ్జిగ చేరువ వలన దాని స్వరూపమే కోల్పోతుంది కదా !

మానవుగు సత్సంగ స్వాధ్యాయముల ద్వారా చక్కని సభ్యతను అలవరచుకొని, మాయా మోహము నుండి దూరుడై దివ్యగుణములతో ప్రకాశించాలి. పతనమందున్న వ్యక్తి కూడా కేవల సత్సంగము ద్వారా ఉన్నతి పొందుతాడు. సభ్యత-సంస్కారము వలన సర్వసుఖములు పొందుదురు గాక!

శంఇతిఓ3మ్

# వైదిక విజ్ఞానము

**ఓ3మ్ యాంమేధాం దేవగణాః పితరశ్చ వుపాసతే**
**తయా మామధ్యమేధ యాగ్నేమేధా వినంకురు ॥యజు॥**

అగ్నిరూప పరమేశ్వరా ! నీ యొక్క అపారమైన కరుణాదృష్టితో మేధావులు, జ్ఞానులు, పితరులు, విద్వాంసులు ఏ జ్ఞానముతో నిన్ను వుపాసించారో, ఆ మేధాశక్తిని మాకునూ ప్రసాదింపుము అని పై యజుర్వేద మంత్రాభిప్రాయము.

ఈ మంత్రము ద్వారా మానవునికి జ్ఞానము అత్యంతావశక్యమని తెలియుచున్నది. మానవుడు తన వ్యవహారిక దక్షతతోనూ, అకుంఠిత దీక్షతోనూ జీవితాన్ని సార్ధకత చేసికొని, జన్మ చరితార్ధము చేసికొనుటకు కావలసిన సమస్త జ్ఞానము వేదములలో పొందుపరచబడి యున్నది.

వేదములు ఈశ్వరీయములు, స్వతః ప్రమాణములు అని ఋషుల అభిప్రాయము. బ్రహ్మ ఈ వేదజ్ఞానమును బ్రహ్మనిష్టులైనవారికి బోధించగా వారా జ్ఞానమును సామాన్య జనులలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. సుమారుగా 5000 సం॥ల పూర్వము వరకు అనగా మహాభారత కాలము వరకు కూడా ఈ వేద సంస్కృతి మనకు ఆచరణలో వుండేదని చరిత్ర చెప్తున్నది.

వేదములలో మానవులు సాధించవలసిన పురుషార్థములకై చతుర్విధ ఆశ్రమముల వర్ణన కూడా వున్నది. అవి బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము, సన్యాసాశ్రమము. బ్రహ్మచర్యములో కనిష్ట బ్రహ్మచర్యము, మధ్యమ బ్రహ్మచర్యము, ఉత్తమ బ్రహ్మచర్యము అని మూడు విధములు.

24 సం॥ల పర్యంతము ఇంద్రియములను నిగ్రహించుకొని, మనసును

వశమందుంచుకొనుటకు కావలసిన పురుషార్థముకై ప్రయత్నశీలుడు కావలెను. ఇది కనిష్ట బ్రహ్మచర్యము. మధ్యమ బ్రహ్మచర్యము అనగా 44 సం॥లు కఠిన బ్రహ్మచర్యమును పాటిస్తూ, వేదాధ్యాయనము ద్వారా సమస్త విద్యలు గ్రహించి ఆత్మబలయుక్తమగునట్లు వర్తించుచుండవలెను.

ఇక 48 సం॥లు అఖండ బ్రహ్మచర్యమును పాటిస్తూ నాలుగు వేదములు సాంగోపాంగముగా అధ్యయనము చేసి, సమస్త శక్తులను స్వాధీనమొనర్చు కొనుటయే ఉత్తమ బ్రహ్మచర్యము. శ్రీకృష్ణుడు ఉత్తమ బ్రహ్మచర్యమును పాటిస్తూ 120 సం॥లు భీష్ముడు 170 సం॥లు జీవించినట్లు చరిత్ర చెప్తున్నది.

ఇక రెండవ ఆశ్రమము గృహస్థము. ఈ గృహస్థము ఇహ పరలోక మార్గములను చక్కపరచుకొనుటకు ఒక గొప్ప సాధనము. జీవితమను సుదీర్ఘ యాత్రలో సన్నిహితులు తోడుగా వుంటే యాత్ర సరళముగా సాగుతుంది. కామ, క్రోధ, లోభ, మోహములు మరియు అహంకారము అను ఐదు గుణములు మర్యాదనతిక్రమించకుండా స్వాధీనమునం దుంచుటకు సరియైన సాధనము ఈ గృహస్థము. సంతానోత్పత్తి, సంతానము యొక్క లాలన, పాలన, బంధుజన సేవ, ధర్మకార్యసాధన, మన యొక్క మన పితరుల యొక్క సౌఖ్యము, సత్సంగస్వాధ్యాయములు ఇవన్నియు గృహస్థాశ్రమ ధర్మములుగా వేదము చెప్తున్నది.

ఏ గృహము నందు స్త్రీ ప్రసన్నురాలై వుండునో ఆ కుటుంబమంతయు ప్రసన్నముగా వుంటుంది. స్త్రీలను గౌరవాదరణములతో చూసిన గృహంలో దేవతులు ఆనందనాట్యం చేస్తారని శాస్త్రము చెప్తున్నది. ఉత్తమ సంతానమును వుత్పన్నము చేయుటము కూడా గృహస్థధర్మమై వున్నదని వేదము చెప్తున్నది. దీనినే పితృఋణము అంటారు. సంతానరూపమగు తన ప్రతినిధిని జాతి దేశముల గౌరవ ప్రతిష్టల కోసం సమర్పించుటయే మానవుని ముఖ్య ధర్మము. ప్రత్యేకించి తల్లిదండ్రులు తమ ఆడపిల్లలకు వ్యాకరణ, వైద్యశాస్త్రములను బోధించవలెనని యజుర్వేదంలో పదకొండవ అధ్యాయములో చెప్పబడింది.

గృహస్తుడు తమ పుత్రునకు పుత్రుడు కలిగిన వెంటనే కుటుంబ బాధ్యతలు పుత్రునకు అప్పగించి, తాను ఆ బంధముల నుండి దూరమై భగవధ్యానములో గడుపుటయే వానప్రస్థము.

చివరగా తాను అధ్యయన, అనుభవ పూర్వకముగా గ్రహించిన సమస్త జ్ఞానమును, ధార్మిక సందేశములను ఇతరులకు ఇస్తూ దేశాటన చేయుటయే సన్యాసాశ్రమ లక్షణము. ఈ ధర్మమును స్వీకరించినవాడు సమస్త దోషములను వదలి, ద్వంద్వములనుండి విముక్తుడై సదా బ్రహ్మము నందే సంచరిస్తూ వుంటాడు.

ఈవిధముగా విద్యను చదువుట, ఉత్తమ శిక్షణను పొందుట, శక్తివంతు డగుటకు బ్రహ్మాచర్యము, అన్ని విధముల వుత్తమ వ్యవహారములను సాధించుటకు గృహస్థము, ఆలోచనను, ధ్యానమును విజ్ఞానమును వృద్ధి పరచుకొనుటకు, తపశ్చర్య చేయుటకు వానప్రస్థము, ధర్మశాస్త్రముల ప్రచారము, సత్యశాస్త్రముల వుపదేశము, అందరి సందేహములను తీర్చుట మొదలగు వాని కొరకు సన్యాసాశ్రమము నిర్ణయించబడినది.

మానవజీవితము వేదములననుసరించి పూర్తి విజ్ఞానముతో వైజ్ఞానిక, క్రమశిక్షణతో కూడినదై, హేతువాదానికి దగ్గరగానూ, ధర్మబద్ధమై వున్నది. ధర్మమునకు, విజ్ఞానమునకు అవినాభావ సంబంధముంటుంది. సృష్టిలో శాశ్వతముగా మనకు గోచరించు నిత్యనియమములు విజ్ఞానమనియు, ఆ నియమముల ఆధారంగా మానవ సమాజ వున్నతికి చేయవలసిన విధానమును ధర్మమనియు ప్రాచీన ఋషులు పేర్కొన్నారు.

**“ఉత్తిష్టత జాగ్రతః ప్రాప్యవరాన్ని బోధత”**

శంఇతిఓ3మ్

# వేదములలో స్త్రీ ధర్మములు

వేదకాలంలో స్త్రీలకు ఉన్నత స్థానం ఉంది. మహర్షి మనువు మరియు ఇతర శాస్త్రకారులు స్త్రీని వుదారభావంతో చూశారు. భారతీయ సంస్కృతి స్త్రీలకు కల్పించిన ప్రాముఖ్యాన్ని తెలిసికోవాలంటే ధర్మశాస్త్రములు విచారించాలి. మానవుల అభ్యుదయ, నిఃశ్రేయస సిద్ధికొరకు మహర్షులు తమ తపోబలంతో నిశ్చయించిన నియమాలే ధర్మశాస్త్రములు. మహర్షులు తమ కరుణాభావంతో స్త్రీ-పురుషుల మేలుకోరి ధర్మశాస్త్రములను రచించారు. ధర్మం బాహ్యావ్యవహారాన్నే కాక అంతఃకరణ ప్రవృత్తులను కూడా నియంత్రిస్తుంది. ధర్మమనేది జీవిత లక్ష్యాన్ని చూపించి, చిత్తశుద్ధిని కలిగించి, మనిషిని శ్రేయమార్గంలో నడిపిస్తుంది. మహాభారతంలో వ్యాస మహర్షి చెప్తాడు.

**"ధర్మేణైవ ప్రజాః సర్వాః రక్షంతి సం పరస్సరమ్"**

ధర్మంతోనే ప్రజలు ఒకరినొకరు రక్షించుకుంటారు. ధర్మంతో శాసన నియమాలు పూరించబడతాయి. కానీ శాసన నియమములతో ధర్మం పూరించ బడదు. ఇంకా స్త్రీల విషయములలో ధర్మశాస్త్రమును పరిశీలిస్తే, మను మహర్షి ఈవిధంగా చెప్తాడు.

**"ద్విధాకృత్వాత్మనః దేహమర్ధేన పురుషోభవత్ అర్ధేన నారీ"**

బ్రహ్మ శరీరం రెండు భాగాలుగా విభజిస్తే, సగ భాగం స్త్రీ గానూ, సగభాగం పురుషుడుగానూ మారిందట.

**"సహస్రం తుపిత్రూన్ మాతా గౌరవేణా తిరిచ్యతే"**

తండ్రి కన్నా తల్లి వెయ్యిరెట్లు ఎక్కువగా గౌరవించతగినది. నవ మాసాలు మోసి బిడ్డను కని, పెంచి తన రక్తాన్ని దుగ్ధములుగా మార్చి, ఆ

బిడ్డను శక్తి మంతులుగా తీర్చిదిద్దుతుంది. తన వెలుగు, ప్రకాశము, తన అభిమానము యావత్తూ బిడ్డల యోగక్షేమములకై వెచ్చిస్తుంది. ఆమె ప్రకాశంతో బిడ్డలు ప్రకాశవంతులగుచున్నారు. కాబట్టే వేదంలో 'మాతృదేవోభవ' అని చెప్పబడింది. తల్లి తమ బిడ్డల అన్యోన్యపు ఐకమత్యము, స్నేహభావము ద్వారా కుటుంబ వంశకీర్తి ప్రతిష్టలు ఇనుమడింపచేస్తుంది. రామలక్ష్మణుల, పాండవుల సోదర ప్రేమ అద్భుతకథలుగా మార్చి పిల్లలకు ఉగ్గుపాలతో నేర్పిస్తుంది.

రామ, రావణ యుద్ధమందు ఒకానొక పరిస్థితిలో లక్ష్మణుడు గాయపడటం జరుగుతుంది. హనుమంతుడు సంజీవనీ తెచ్చుటకు బయలుదేరి, దానిని తీసుకొని వచ్చు మార్గమధ్యలో భరతుడు వానికెదురై, హనుమంతుడు తన సోదరభక్తుడని, సోదరుని ప్రాణముల కొరకు ఔషధమును తీసుకొని పోవుచున్నాడని తెలిసికొని అమితంగా సంతోషించి, తన తల్లుల దగ్గరకు ఆహ్వానిస్తాడు. అక్కడ తల్లులందరూ సీతారామలక్ష్మణుల గూర్చి కుశల ప్రశ్నలు వేస్తారు. వారి వద్ద కొంతసేపు వుండి మరలిపోవుచున్నప్పుడు సుమిత్ర, కౌసల్య ఇద్దరూ వేరువేరు సందేశములు రాముడికి పంపుతారు.

**సుమిత్రా సందేశము :** రామా ! లక్ష్మణుని వనవాసమునకు తల్లిదండ్రులు ఆజ్ఞ ఇవ్వలేదు. అతడు నిన్ను సేవించుటకు, ఎన్నో కష్టముల కోర్చి నీతో బయలుదేరాడు. నిన్ను దశరథునిగా, సీతను నాతో సమానంగా భావించి, సేవచేసి తరించమని వుపదేశించాను. అవసరమైతే వారి కొరకు ప్రాణమైనా ధారపోయటానికై వెనుకాడవలదని హెచ్చరించాను. ఈ ఔషధములతో అతడు పునర్జీవితుడు కానిచో నీవు బాధపడవలదు. అతడు తన ధర్మనిర్వహణలో ఉత్తమగతిని పొందినాడని సంతోషించుము.

**కౌసల్య సందేశము :** రామా నిన్ను నేను అడవులకు ఒంటరిగా పంపలేదు. దైవవశాత్తు మన లక్ష్మణుడు ప్రాణములు కోల్పోయిన నీవు అయోధ్యకు తిరిగి రావలదు అని హెచ్చరిస్తుంది.

ఈ సందేశములు భారతీయ స్త్రీమూర్తుల సంస్కార ఔన్నత్యములకు

ప్రతీకలు. ఇటువంటి ఆదర్శ సంస్కారములు పిల్లలకు చిన్ననాటి నుంచి నేర్పించి వారిని సుశీలురుగా తీర్చిదిద్దే తల్లి ధన్యురాలు.

**"అనువ్రతః పితుః పుత్రో మాతా భవతు సమ్మనాః**
**జాయపత్యే మధుమతీం వాచం వదతు శాంతివాన్"**

పుత్రుడు, తండ్రి ఆచరించే ధర్మములను తన ధర్మములుగా భావించి ఆచరించాలి. తల్లి మాట జవదాటనివాడుగా వుండాలి. భార్య, భర్తతో ఎప్పుడూ మధురమైన శాంతివచనములే ఆడాలి అని మనకు పై ఋగ్వేదమంత్రం చెప్తుంది. తండ్రి ఏయే ధర్మములు ఎటువంటి జ్ఞానముతో ఆచరిస్తాడో పుత్రుడు ఆ ధర్మములను నెరవేర్చాలి. తండ్రికి, బిడ్డకు తల్లి వారధి కావాలి. తల్లి ఎంతటి సంస్కారవంతురాలైతే బిడ్డలు అంత వున్నతులౌతారు. అపుడే ఆ తండ్రి పుత్రుల బంధం శాశ్వతమవుతుంది. తల్లిదండ్రుల యొక్క, సోదర, సోదరీమణుల పరస్పర వ్యవహారములన్నియూ స్త్రీ యొక్క సంస్కారములే. అవిశ్వాసము, మనో మాలిన్యము, అసూయాద్వేషములు పరస్పర ప్రేమానురాగముతో మటుమాయ మవుతాయి.

స్త్రీ తన యొక్క జ్ఞానము, తెలివితేటలతో భర్త యొక్క మనసును ఆక్రమించుకోవాలి. భర్తతో ఎపుడూ మధుర భాషణము చేయాలి. భర్త ఎంత ధార్మికుడైనా స్త్రీ యొక్క మమత్వ భావము వలననే సదా ఉన్నతి పొందగలుగు తాడు. అపుడే అతని ధార్మిక శక్తి రెట్టింపు అవుతుంది.

**"ఓషధయః ప్రతి గృభ్ణీత పుష్పవతీ సుపిప్పలాః**
**అయం వో గర్భ ఋత్వియః ప్రత్నం సధస్థమాసదత్"**

స్త్రీలు వైద్య–వ్యాకరణాది శాస్త్రములు చదువవలెనని పై యజుర్వేద మంత్రం చెప్తున్నది. రోగనాశకములు, గర్భ స్థాపకములు అగు ఓషధులను తెలిసికొని తమ సంతానమునకు నిరంతరము ఆనందమును పంచగలరు. వాతావరణ ప్రభావము వలన గానీ, ఇతర కారణముల వలన గానీ కుటుంబ వ్యక్తులకు కలిగిన ఏ అసౌకర్యమునకైనా ఔషధము స్త్రీ వద్దనే వుంటుంది.

స్త్రీ అతి ప్రసన్నురాలై, చతురురాలై కుటుంబ వ్యవహారములందు అప్రమత్తంగా వుంటూ పదార్ధములను వుత్తములుగా తీర్చిదిద్దుతుంది. ఇంటిని పవిత్రముగా వుంచి మితవ్యయిగా ఉంటూ శరీరము నందు, ఆత్మయందు ఎటువంటి రోగము రాకుండనీయట్టి పాకము చేస్తుంది. ఇంట్లో పనివాండ్లచే యధాయోగ్యముగా పనిచేయిస్తుంది. వృద్ధులు, పితరులు వుంటే వారిని సేవిస్తుంది. ఇటువంటి స్త్రీ కార్యదక్షురాలని మను ధర్మశాస్త్రం చెప్తున్నది. స్త్రీని సదా ప్రసన్నురాలిని చేయవలసిన బాధ్యత పురుషునిదే. స్త్రీ ప్రసన్నంగా వుంటే కుటుంబమంతయూ ప్రసన్నంగా వుంటుంది.

**"మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ పురుషోవేదః"**

తల్లి, తండ్రి, ఆచార్యులు ఈ ముగ్గురే పిల్లలకు శిక్షణ నిచ్చేవారు. చిరుత ప్రాయంలోనే పిల్లలకు శిక్షణ నివ్వటంలో తల్లి పాత్ర అమోఘం, అద్భుతం. స్త్రీలు గర్భవతిగా వున్నపుడే భోజనం సాత్వికంగా సేవించాలి. శొంఠి కలిపిన పాలు, నెయ్యి మొదలగు పుష్టికారక పదార్ధాలు సేవించాలి. పిల్లలు జన్మించిన తరువాత ఐదు సంవత్సరముల వరకు తల్లి వద్దనే శిక్షణ నివ్వాలి.

స్వతహాగా జ్ఞానవంతురాలైన స్త్రీని, బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో పుత్రుడు సదా రక్షించుకోవాలని మను ధర్మశాస్త్రం చెప్తుంది. ఆ స్త్రీ తనని తాను రక్షించుకోగలదని ఆమె రక్షణ భారాన్ని వుపేక్షించరాదని మహర్షి అత్యంత కరుణాభావంతో చెప్పటం జరిగినది.

**"పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యవ్వనే**
**రక్షతి స్టవిరేపుత్రాః న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి"**

స్త్రీలలో వున్న ప్రకృతి సిద్ధమైన శారీరక దుర్భలత వలన మరియు మాన, శీల, ప్రాణ రక్షణ విషయంలో ఆమె ఎదుర్కొనవలసిన కఠిన పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ఆమె రక్షణభారం పురుషుడే వహించాలి అని మహర్షి ఆశయం.

శంఇతిఓ3మ్

# విద్యార్థి

విద్యను అర్థించేవాడు విద్యార్థి. అర్థించటమంటే కోరటం. మనం దేనిని కోరతాం ? మన దగ్గర లేనిదానిని కోరతాం. అది విద్య. అదే జ్ఞానము. ఈ ప్రపంచములో సృష్టి, స్థితి, లయములకు సంబంధించిన సమస్త జ్ఞానము పరమేశ్వరునిదే. అతనే సమస్త విద్యలకు ఆది గురువు.

విద్యార్థులు చదువుకోవటం ఒక వ్రతంలాగా స్వీకరించాలి. అపుడే దానియందు శ్రద్ధ వస్తుంది.

**"ఓ3మ్ వ్రతేన దీక్ష మాప్నోతి దీక్ష యాప్నోతి దక్షిణామ్**
**దక్షిణా శ్రద్ధ మాప్నోతి, శ్రద్ధయా సత్యమాప్యతే" ॥ఋగ్॥**

శ్రద్ధ వలనే సత్య జ్ఞానం వృద్ధి పొందుతుంది. ఏ కార్యాన్నైనా సాధించాలనే దృఢసంకల్పం దీక్ష అనబడుతుంది. దీక్ష వలన దక్షిణ పొందగలుగుతాడు. దక్షిణ అనగా వేదభాషలో 'చతురత' అని అర్థం. చతురత వలన మానవుడు వుత్సాహ పూరితుడౌతాడు. ఈ వుత్సాహం వలననే మానవునిలో శ్రద్ధ పుడుతుంది.

**"శ్రః సత్యం దదాతి యయా క్రియయా సాశ్రద్ధాః"**

ఏ క్రియ వలన సత్యజ్ఞానం కలుగుతుందో అది శ్రద్ధ అని శాస్త్రం చెప్తోంది. అనగా నిరంతరం మనం సత్యాన్ని ధారణ చేయాలి. అనగా ధరించి వుండాలి. అప్పుడే మనం తప్పులు చేయకుండా వుండగలుగుతాం. పిల్లలుగానీ, పెద్దలు గానీ ఒక తప్పుచేసి దాన్ని ఒప్పుకోవటం గొప్పకాదు. గురువులు, తల్లిదండ్రులు చెప్పిన దానిని గ్రహించి, మనోవిచారణ చేసికొని, ఆ తప్పు చేయకపోవటం వలన వారిలో విశ్లేషణ జ్ఞానం పెరుగుతుంది. ఆవిధముగా తల్లిదండ్రులు, వుపాధ్యాయులు పిల్లలకు శిక్షణ నివ్వాలి.

**"సత్యా న్న ప్రమది త్యవమ్**
**ధర్మా న్నప్రమదితవ్యమ్**
**మాతృదేవోభవ, పితృదేవోభవ,**
**ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ"** ॥తై॥అ॥

విద్యార్థులెల్లరూ ప్రమాదముచే సత్యమును వదలకూడదు. ప్రమాదముచే ఎప్పుడూ ధర్మాన్ని వదలకూడదు. తల్లిదండ్రులను సేవించుటయందు ప్రమాదము చేయరాదు. విద్వాంసులను సత్కరించునట్లు తల్లిదండ్రులను, ఆచార్యులను, అతిథులను సర్వదా సేవించాలి. సత్యభాషణాది ధర్మకార్యములను నిత్యము ఆచరించాలి.

**"మాతా శత్రుః పితా వైరిః యేనబాలో న పాఠితః**
**న శోభతే సభామధ్యే హంసమధ్యే బకోయధా"** ॥చా॥నీ॥

విద్య నేర్చుకొనని బాలుడు హంసల మధ్య కొంగవలె శోభించడు. అందరి చేత తిరస్కరించబడుతాడు. విద్యను నేర్పని తల్లిదండ్రులు సంతానమునకు ప్రబల శత్రువులుగా వుంటారు అని చాణక్య నీతిలోని అర్థం. కాబట్టి కౌమార దశలో వున్న విద్యార్థులందరూ సదాచారవంతులై, సుశిక్షితులుగావలసి యున్నది.

లోకంలో అందరూ మేలు కలగాలని, శుభం జరగాలని కోరుకుంటాం. కానీ మేలు అనేది స్వాభావికం కాదు. దానంతట అది పుట్టుకొచ్చే వస్తువు కాదు. ఇతరుల ద్వారా మానవ ప్రయత్నం ద్వారా, పురుషార్థం వల్ల లభిస్తాయి. ఒక వ్యక్తి ధర్మాన్ని ఆచరిస్తే అతను ధర్మాత్ముడవుతాడు. ధర్మమనేది స్వాభావికం కాదు. అతని క్రియాశీలతే అతనిని ధర్మాత్ముణ్ణి చేస్తుంది.

**"ఆలస్యం మద మోహౌంచ చాపల్యం గోష్ఠి రేవచ**
**స్తబ్ధతా చా భిమానిత్వం తధాత్యాగి త్వమేవచ**
**ఏతేవై సప్త దోషాః స్యుః సదా విద్యార్థినాం మతాః"** ॥వి॥నీ॥

ఆలస్యము అనగా శరీరము నందుగానీ, బుద్ధియందు కానీ సోమరితనము, మత్తు, విద్య తప్ప తక్కినవానియందు ఇష్టాన్ని పెంచు కోవటం, చపలత, అక్కడికి – ఇక్కడికి తిరుగుచూ వ్యర్థముగా కాలాన్ని వృధా చేయటం, పెద్దవాళ్ళు ఏదోమాటలాడుకుంటూ వుంటే అవి ఆసక్తిగా వినటం, చదువుచూ మానటం, అభిమాని కావటం, పిసినిగొట్టుతనము అనునవి ఏడు లక్షణములు విద్యార్థులకు వుండకూడనివి.

ఈ ఏడు దోషములున్న వారికి విద్య లభించదు అని విదుర నీతి చెప్తున్నది.

తల్లిదండ్రులు జ్ఞానవంతులైతే పిల్లలు తమ కర్తవ్యాన్ని మరచిపోరు. పిల్లలకు ఏ అలవాటైనా ఇంటివద్దనే ఆరంభమవుతుంది. ఇంటి వాతావరణం ఎలా వుంటే పిల్లల స్వభావం అలా తయారవుతుంది.

**"విద్యా నామ నర స్వరూప మధికం ప్రచ్ఛన్న గుప్తధనం**
**విద్యా భోగకరి యశస్సుభకరీ విద్యాగురుణాం గురుః**
**విద్యా బన్ధుజనో విదేశగమనే విద్యాపరదేవతా**
**విద్యా రాజసుపూజ్యతే నహిధనం విద్యావిహీనః పశుః"**

**॥భ సు॥**

పురుషునకు విద్యయే రూపము. విద్యయే రహస్యముగా దాచిన ధనము. విద్యయే సకలభోగములను కీర్తిని సుఖమును కలుగచేయును. విద్యయే గురువు వలే అన్నియు బోధించును. పరదేశము నందు కూడా చుట్టము వలె సహాయపడును.

విద్యయే పరమాత్మ. విద్యయే రాజపూజితము, ధనము కాదు. ఇట్టి విద్యలేనివాడు పశుతుల్యుడని భావము.

కాబట్టి విద్యార్థులందరూ ఒకటి గ్రహించాలి. బంగారమునకు కాంతి, పుష్పమునకు సుగంధము ఏవిధంగా వన్నె తెస్తాయో మానవునకు సదాచారము అంత ముఖ్యము. జ్ఞానుల మార్గమునే అనుసరించాలి. సూర్యోదయమునకు ముందే మేల్కొనుచూ, కాలకృత్యములను తీర్చుకొని

స్నానము, సంధ్య, స్వాధ్యాయము, తల్లిదండ్రుల సేవ, పరోపకారము, కర్తవ్యపాలన, సత్యభాషణము, బ్రహ్మచర్య పాలన మొదలగు సదాచారములు పాటించాలి. సదాచారము వలన దీర్ఘాయువు కలిగి, ఆరోగ్యవంతులవుతారు.

శంఇతిఓ3మ్

సహయజ్ఞాః ప్రజాః సృష్ట్వా
పురోవాచ ప్రజాపతిః
అనేన ప్రసవిష్యధ్వ
మేషవో అస్త్విష్ట కామధుక్ (భగవద్గీత)

**భావార్థము :**

పరమాత్ముడు మానవులను సృజించి వారి కోరికలను నెరవేర్చుకునేందుకు ప్రథమంగా యజ్ఞాన్ని వారికి అర్పించి, దీనిద్వారా అభివృద్ధిని, అభీష్టసిద్ధులను పొందండి. ఇది మీకు కామధేనువు వంటిది.

అగ్నిర్దేవో ద్విజాతీనాం మునీనాం హృదిదైవతమ్।
ప్రతిమా స్వల్పబుద్ధీనాం సర్వత్ర సమదర్శినః॥ (చా।నీ)

**భావార్థము :**

ద్విజులకు అగ్నిహోత్రమే దేవుడు. మునులకు దైవము హృదయమందు వుండును. అల్పబుద్ధులు కలవారికి విగ్రహమునందును, పండితులకు పరమాత్ముడు అంతటా వుండును.

# స్వాధ్యాయము

వేదములందు స్వాధ్యాయ మహిమ చక్కగా వర్ణింపబడినది. ఉపనిషత్తులు, ధర్మశాస్త్రములు, దర్శనములు, బ్రాహ్మణములు కూడా స్వాధ్యాయమును ప్రశంసించాయి. ప్రాచీన ఋషులు మానవ జీవితమును నాలుగు ఆశ్రమము లుగా విభజించారు. అవి వరుసగా బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్థము మరియు సన్యాసాశ్రమము. ఈ నాలుగు ఆశ్రమములందునూ స్వాధ్యాయము జరుగవలెను. పతంజలి మహర్షి యోగదర్శనములో యమ, నియమములను చెప్తూ స్వాధ్యాయమును గూర్చి చెప్పటం జరిగింది.

**"శౌచ సంతోష తపః స్వాధ్యాయ ఈశ్వర ప్రణి ధానాని నియమ"**

**।యో।ద॥**

అంతర, బాహ్య శౌచము అనగా పవిత్రత, సంతోషము అనగా ఆత్మతృప్తి, తపస్సు అనగా పురుషార్థమును చేయటంలో వచ్చు వడిదుడుకులను తట్టుకొనే శక్తి కలిగి వుండటం, స్వాధ్యాయము అనగా వేదములు, ఈశ్వర సంబంధమైన విచారములు కలిగి వుండటము, చివరగా ఈశ్వర ప్రణిధానము అనగా ఈశ్వరుని గూర్చి, సృష్టి, స్థితి, లయముల కర్త ఒకడున్నాడని తెలిసికొని వాని యందు సదా మనస్సును నిలిపి వుంచటము, ఇవి నియమములు. స్వాధ్యాయము నందు కానీ, వేదధర్మములు ప్రచారము నందుకానీ మానవులు ఎన్నడూ ప్రమాదము చేయరాదు అని ఉపనిషత్తు చెప్తోంది.

శారీరక ఉన్నతి కొరకు భోజనము ఎట్లవసరమో, అట్లే ఆత్మిక వున్నతి కొరకు స్వాధ్యాయము అంతే అవసరము. స్వాధ్యాయము చేయుట వలన మానవుని మనస్సు పవిత్రమవుతుంది. చక్కని, ఉన్నతమైన ఆలోచనలు

కలుగుతాయి. దీనివలన జ్ఞానము వృద్ధి పొందుతుంది. దానివలన బుద్ధి వృద్ధి పొందుతుంది. బుద్ధి, వృద్ధి పొందినందువలన మానవుడు అత్యంత సూక్ష్మ విషయాన్ని సైతము త్వరగా గ్రహించగలుగుతాడు.

ఏదైనా కొలనులోకి నీరు వచ్చుట ఆగిపోయినపుడు నిలువ నీరు మురిగి, పురుగులు ఏర్పడును. ఆ నీటిపైన నాచు వ్యాపించినచో నీరు కుళ్ళి పోవును. ఆ విధముగనే స్వాధ్యాయము చేయనందువలన మానవ మనోవృత్తులు కూడా కలుషితములవుతాయి. స్వాధ్యాయము యొక్క ప్రభావము వలన సాధారణ మానవుడు కూడా మహాత్ముడు కాగలడు. చరిత్రలో ఎన్నో వుదాహరణలు.

శ్రీ లోకమాన్య తిలక్ ఒక సందర్భములో యిలా చెప్తారు.

> **“నేను నరకములో కూడా మంచి పుస్తకములకు స్వాగతము చెప్తాను. ఎందుకంటే మంచి పుస్తకములు ఎక్కడ వుంటే అక్కడ స్వర్గముగా మారి పోవునట్టి శక్తి కలిగించును”**

వేదము, ఈ సృష్టి సాహిత్యమునకే శిరోరత్నము. వేదములను అధ్యయనము చేసినందువలన మానవులు సమస్త పాపముల నుండి దూరులవుతున్నారు. స్వాధ్యాయము వలన మనస్సు కడుగబడి, శుద్ధముగను, పవిత్రముగను మారుతుంది.

సముద్రములో ఒకసారి మునిగి అమూల్యమైన రత్నములను పొందుట ఎంత విశేషమో, ఆర్ష సాహిత్యమును చదువుట, చదివించుట అంత గొప్ప తనమని స్వామి దయానంద సరస్వతి చెప్తారు.

మస్తిష్కములోని ఆలోచనల పూర్ణ స్వరూపమే మానవుడు. ఉన్నతమైన ఆలోచనలతో మానవుడు ఎపుడూ తన జీవితమును శుద్ధముగా, పవిత్రముగా మార్చుకోవాలి.

> **“భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః**
> **భద్రం పశ్యేమాక్ష భిర్యజత్రాః**

**స్థిరై రంగై స్తు ష్టు వాం సస్తనూభిః వ్యసే మహి**
**దేవ హితం యదాయుః" ॥యజు॥**

ఓ పరమేశ్వరా ! ఎల్లప్పుడూ మేము శుభములే విందుము గాక ! ఎల్లప్పుడూ శుభములే చూచెదము గాక ! నిన్నే వుపాసించు మేము దృఢమైన శరీరములు కలిగి, నూరు సంవత్సరములు జీవించెదము గాక ! మానవుని యొక్క ఆలోచనల పరిపూర్ణ స్వరూపమిదే !

చదువురానివారు, మూగవారు సైతం స్వాధ్యాయము చేయవచ్చునని శాస్త్రములో చెప్పటం జరిగినది.

**"స్వాధ్యాయోనామ ప్రణవ జపః"**

ఓంకారమును పలుమారు జపించటము, ధ్యానము చేసికొనటం కూడా స్వాధ్యాయమనబడుతుంది. సాధకుడు ఏకాంతంగా కూర్చొని ఓంను మాటిమాటికి స్మరించాలి. ఓం అనగా రక్షించేవాడు అని అర్థం. ఓంకారము భగవంతుని నామములన్నింటిలోకెల్లా వుత్తమమైన నామము అకార, ఉకార, మకార సమన్వితము. ధ్వని శాస్త్రమంతా ఈ ఓంకారము నందే యిమిడి వున్నది.

శంఇతిఓ3మ్

**అన్నాద్ భవంతి భూతాని**
**పర్జన్యాదన్నసంభవః**
**యజ్ఞాత్ భవతి పర్జన్యో**
**యజ్ఞః కర్మ సముద్భవః** **(భగవద్గీత)**

**భావార్థము :**

అన్నము వలన సమస్త ప్రాణులు జీవిస్తున్నాయి. ఆ అన్నము మేఘాలు వర్షించటం వలన ఉత్పన్నమౌతాయి. ఆ మేఘాలు యజ్ఞం వలన మాత్రమే ఏర్పడతాయి. ఆ యజ్ఞం వేదవిహిత కర్మ వలన సంభవము.

# భారతీయ సంస్కృతి-వేదములు - 1

మనము నివసించు ఈ దేశము భారతదేశము. దీనినే ఆర్యావర్తమని చరిత్రకు అందని నాటినుండి హేతుబద్ధమైన నామము ఉన్నట్లు తెలుస్తున్నది. అందుకే మనవాళ్ళు ఇప్పటికీ దైవకార్యములలో ఆర్యావర్తే, పుణ్యభూమౌ..... అని సంకల్పం చెప్పుకోవటం జరుగుతుంది. ఆర్యులు అనగా ధార్మికులు అని అర్థం. మరి ధార్మికులంటే ? సమస్త ధర్మములకు మూలమైన వేద ధర్మములను ఆచరించువారని అర్థం.

చరాచర జగన్నిర్మాణకర్త అయిన పరమేశ్వరుడు, అతని గుణ, కర్మ, స్వరూప, స్వభావములను తెలుసుకొనుటే వేదధర్మాచరణ ఫలితము. వేదమునందు పరమాణువు మొదలు పరమేశ్వర పర్యంతము యదార్థమైన విషయములు ఉన్నట్లు అనేక శాస్త్రముల ద్వారా తెలియుచున్నది.

వేదసాహిత్యము ననుసరించి మహర్షులు మూడు తత్వములను తెలియ జేశారు. అవి ప్రకృతి, జీవుడు, పరమాత్మ. దీనికి ప్రమాణము ఈ క్రింది ఋగ్వేద మంత్రము.

**"ద్వా సుపర్ణా సయుజా సఖాయా సమానం వృక్షం పరిషస్వజాతే**
**తయోరన్యం పిప్పలం స్వాద్వత్ నశ్న నన్యో భిచాకశీతి"**

**॥యజు॥**

ఒకే వృక్షమును ఆశ్రయించి ఉన్న రెండు పక్షులు సమాన లక్షణములు కలవి, సమాన సంబంధములు కలిగివున్నవి. అందులో ఒకటి ఆ వృక్షము యొక్క ఫలములను ఆరగించి ఆస్వాదించుచున్నది. రెండవది ఫలములను తినక, సాక్షిగా అంతటా ప్రకాశించుచున్నది. పై భావార్థమును బట్టి జీవేశ్వరులు రెండు పక్షులుగాను, ప్రకృతి వృక్షము గాను వర్ణింపబడినవి.

సుపర్ణః = మంచిరెక్కలు, జీవునకు, ఈశ్వరునకు కూడా క్రియాశక్తి జ్ఞానశక్తి రెండు రెక్కలు. ఈ రెండు శక్తులు లేకున్నా ఏ పక్షీ పైకి ఎగురలేదు. జీవుడు, ఈశ్వరుడు కూడా క్రియాశక్తి, జ్ఞానశక్తి అను రెండు రెక్కలు లేకున్నా జగన్నిర్మాణ కృత్యములు నెరవేర్చ జాలరని భావార్ధము.

ద్వా అనగా రెండు అను సంఖ్యాబోదకము వలన జీవుడు, ఈశ్వరుడు అను రెండు పదార్ధములు ఉన్నట్లు తెలియుచున్నది. ఆత్మను కూడా ఒక పదార్ధముగానే మహర్షులు పరిగణించారు. దీనికి ప్రమాణము :

**పృధివ్యాప స్తేజో వాయురాకాశ కాలో**
**దిగాత్మా మనాంసి ఇతి ద్రవ్యాణి॥ ॥వై॥ద॥**

ఈవిధంగా సృష్టిలోని సమస్త పదార్ధములు తొమ్మిది తత్వములుగా మహర్షులు విభజించారు. పై మంత్రములోని జీవేశ్వరుల సబంధము సనాతనమైనది. పరమాత్మ నియామకుడు, జీవుడు నియమింపబడేవాడు. జీవేశ్వరులకు ఇద్దరికీ చైతన్యము, జ్ఞానము లక్షణములు. పరమేశ్వరుని జ్ఞానము అనంతము. జీవుని జ్ఞానము అల్పము.

అనంత జ్ఞానశక్తి యుక్తుడైన పరమేశ్వరుని ఉపాసించుటే జీవుని యొక్క ముఖ్యధర్మము. ఇకపోతే ఒకే వృక్షమును అంటి పెట్టుకొని ఉన్నట్లు తెలుస్తున్నది. ఇక్కడ వృక్షము ప్రక్కతి బోధకము. చేధింపబడి, అనేక మార్పులకు లోనయ్యేది వృక్షము.

ఆవిధంగానే ప్రకృతి కూడా అనేకమార్పుతో సత్వరజస్తమో గుణయుక్తమై నిరంతరము రూపాంతరము చెందుతుంది. ఈవిధంగా జీవేశ్వరులు ఇరువురు ప్రకృతిని ఆశ్రయించుకొని, జీవుడు ఆ ప్రకృతిని అనుభవించి ఆస్వాదించువాడు గనూ, పరమేశ్వరుడు అంతటా ఉంటూ ప్రకృతికి అతిరిక్తుడుగా ఉన్నట్లు పై మంత్రం చెప్తున్నది.

భారతీయ వైదికమతాన్ని ఉగ్రూతలూగించి, పెకిలించివేయడానికి అనేక సంస్కృతులు ఒకదానివెంట ఒకటి బయలుదేరినా ఆ మహా

ప్రవాహములో వైదికమతం ఒకింత వెనక్కి మరలినా తిరిగి తన ప్రభావాన్ని భారతీయేతరులను సైతం ఆకర్షించుకొని తనలోకి జీర్ణించుకుంది.

**సూర్యాచంద్రమసౌ ధాతా యథాపూర్వ మకల్పయత్ ॥**

**॥యజు॥**

సూర్యచంద్రులను తిరిగి పూర్వకల్పాల్లో మాదిరే భగవంతుడు సృజించాడు. ఈ మంత్రం నిత్యం సంధ్యావందనంలో జపించటం జరుగుతుంది. వేదము లనగా, స్వతహాగా జ్ఞాని అయిన మానవుడు కొన్ని నియమనిబంధనలతో పరమాత్మ ప్రాప్తికై ప్రయత్నించే కర్మ, జ్ఞాన, ఉపాసనా చరణము, భారతదేశములో కొన్ని యుగయుగాల నుండి వస్తున్నది. గతయుగాలలో భారతీయులకు సామూహిక ప్రార్ధనా మందిరాలు కాని, ప్రార్థనాలయాలు కాని ఉండెడివి కావు అని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. కాని వారు ఎవరికి వారు అంతర్యామి అయిన ఆ పరమాత్మ సాక్షాత్కారము కోసం ప్రాణాయామము, అగ్నిహోత్రాది క్రియలు ఆచరించేవారు.

భారతీయ ప్రాణశక్తి దాని సంస్కృతిలో ఉంది. భారతీయులు తమ పూర్వుల నుండి మహర్షుల నుండి విద్వాంసుల నుండి సంక్రమించిన మహోన్నత జ్ఞానసంపదను మరువనంత వరకు ఈ జాతిని ఏ శక్తీ నిర్వీర్యం చేయజాలదు.

**యత్ర బ్రహ్మ చ క్షత్రం చ సమ్యం తౌ చరతః సహ**
**తం లోకం పుణ్యం ప్రజ్ఞేషాం యత్రదేవాః సహాగ్నివాః**

ఏ దేశప్రజలు ఎంతకాలం శ్రద్ధాభక్తులతో వేదసంస్కృతిని ఆచరించుచూ, ఆచరింపచేయుదురో అంతవరకూ ఆ దేశప్రజలకు దుర్భిక్షముకాని, త్రివిధ దుఃఖములు కాని దూరముగా ఉంటాయని పై యజుర్వేద మంత్రభావార్థము.

వేదధర్మాచరణముతో సమాజములో సంఘటనా శక్తి, సమైక్యతా, దేశభక్తి సంస్కృతి పరిరక్షణకు అవసరమగు జ్ఞానక్రియాశక్తులు ప్రాప్తింప చేసుకొని సమస్త శాస్త్ర విషయములందు సమాన బుద్ధి గల సమన్వితులై

ఉంటారని తెలుస్తున్నది. కాబట్టి భారతీయులు తమ ప్రాచీన వైభవాన్ని గురించి ఎంతగా తెలుసుకుంటే వారి భవిష్యత్తు అంతా ఉజ్వలంగా ప్రకాశిస్తుంది.

శంఇతిఓ3మ్

**కర్మ బ్రహ్మోద్భవం విద్ధి**
**బ్రహ్మాక్షర సముద్భవం ।**
**తస్మాత్ సర్వగతం బ్రహ్మ**
**నిత్యం యజ్ఞే ప్రతిష్టితమ్ ॥** **(భగవద్గీత)**

**భావార్థము :**

సమస్త వేదవిహిత ధర్మములు, కర్మలు, నాశరహితుడైన పరబ్రహ్మ స్వరూపుడైన ఆ పరమాత్ముని నుంచే ప్రసిద్ధమవుతున్నాయి. ఆ పరమాత్ముడు సర్వవ్యాపకుడై, అనంతుడై అంతటా ఓతప్రోతమై వున్నాడు. ఆ భగవంతుడే ప్రతినిత్యం మనం చేసే యజ్ఞంలో స్థితమై యున్నాడు.

**పత్యురాజ్ఞాం వినా నారీ ఉపోష్య వ్రతచారిణీ।**
**ఆయుష్యం హరతే భర్తుః సా నారీ నరకం వ్రజేత్ ॥**
**(చా।నీ)**

**భావార్థము :**

భర్త అనుమతి లేకుండా స్త్రీ ఉపవాసాది వ్రతముల పేరుతో ఆకలితో వున్నచో అట్టి స్త్రీ భర్త ఆయుష్షును హరించటమేకాక, ఆ స్త్రీ స్వయంగా దుఃఖమును అనుభవించును.

# గృహస్థాశ్రమ ధర్మములు

మానవులకు అతి విలువైన ఆశ్రమము గృహస్థాశ్రమము. చతుర్విధాశ్రమములో గృహస్థాశ్రమము తీర్థముతో సమానమనే చెప్పాలి. యువతీ యువకులు వివాహము చేసుకొని భార్యాభర్తలుగా మారి ఒకనాటికి తల్లిదండ్రులవుతారు. ఈ ఆశ్రమములో భోగము మోక్షము రెండూ లభిస్తాయి. ఇది స్వర్గధామమని ఋషులు, మునులు ఎంతగానో శ్లాఘించారు. గృహస్థాశ్రమము ఇతర ఆశ్రమములకంటే కొంచెం కఠినమనే చెప్పాలి. కారణం ఇందులో మనుష్యులకు బాధ్యత అధికంగా వుంటుంది. కేవలం తన కుటుంబ బాధ్యతే కాకుండా ఇతర ఆశ్రమత్రయ బాధ్యత కూడా వహించవలసి వుంటుంది. అత్యధిక బాధ్యత గృహయజమాని, తండ్రి మీద వుంటుంది. **'యఃపాతి సాపితా'** అనుధాతువు నుండి పిత శబ్ధము ఉత్పన్నమవుతుంది.

అనగా కుటుంబమునకు అన్నము, సంస్కారమునిచ్చి పోషించువాడు కావున పిత అనబడుచున్నాడు. అనగా రక్షించేవాడు. ఈ బాధ్యతలు నిర్వహించుటకు గాను తండ్రి అయిన వాడు బలవంతుడుగాను, సదా ఆరోగ్య సంపన్నుడుగానూ వుండుట అవసరము.

**వేదానధీత్వ వేదౌ వా వేదమ్వాసి యధా క్రమమ్**
**అవిప్లుత బ్రహ్మచర్యా గృహస్థాశ్రమ వసీత ॥**

విద్యార్థి నాలుగు, మూడు, రెండు లేక ఒక వేదమునైననూ సాంగోపాంగముగ చదివి బ్రహ్మచర్యమును కాపాడుకొనుచూ గృహస్థాశ్రమము నందు ప్రవేశింపవలయును అని మనకు శాస్త్రము చెప్తోంది.

గృహస్థాశ్రమమందున్న మానవుడు తండ్రిగా, భర్తగా బంధువుగా

తన కర్తవ్యమును పాలించుచూ, వేద విహిత కర్మలాచరించుచూ, తన వున్నతి చూచుకొనుచూ సమాజ శ్రేయస్సును కాంక్షించాలి. తండ్రి ఎలా వుండాలో ఈ క్రింది అథర్వవేదమంత్రం చెప్తోంది.

**ఊర్జం బిభ్రతః వసువనిః సుమేధా**
**అఘోరేణ చక్షుషామిత్రి యేణ**
**గృహనైమి సుమనా వందమానోరమధ్వం**
**మా బిభీతమత్ ॥**

ప్రాణశక్తిని ధరించుచూ, ధనార్జన చేయువాడు ఉత్తమ మేధాసంపన్నుడు, క్రోధరహితుడై స్నేహపూర్వక నేత్రములతో చూచువాడు, శాంతి పూర్వక మనస్సు కలవాడు అయిన గృహస్థుని చూచి గృహవాసులందరూ ఆనందముగా వుంటారు. అతనిని చూచి ఎవరూ భయపడరు.

గృహమును సర్వాంగ సుందరముగా రూపొందించుకొనుచూ అదొక చిన్న స్వర్గ ఖండముగా మార్చుకొనుట ప్రతి తండ్రి యొక్క కర్తవ్యము. అట్లు స్వర్గమయం చేసి కొనుటకు తండ్రికి ఏ గుణములవసరమో వేదం చెప్తోంది.

**"ఊర్జం బిభ్రతః వసువనిః"**

ఈ ప్రపంచం ఒక యుద్ధరంగం. దీనినే భవసాగరమనియు అనవచ్చును. కొండబండలతో నిండినది. ఇటువంటి సముద్రంలో ఈదుటకు అనంతమైన శక్తి కావాలి. ఎవరు రోగరహిత శరీరధారులై సర్వావయవ సౌష్టవ సంపన్నులై కుటిలత్వమునకు దూరంగా శుద్ధ సరళ స్వభావులైన మానవోత్తములు ఆనందమయ జీవితము గడుపుతారని వేదం చెప్తున్నది. బలహీనులు, భయగ్రస్తులు గృహస్థాశ్రమమును నిర్వర్తింపలేరు, శక్తి-నిర్ధోషిత్వము రెండు కలసి మెలసి వుండును. శక్తి కలవాడు ద్వేషమును జయించగలడు. రోగగ్రస్తుడై నపుడు శక్తి క్షీణించును. అట్టి సమయములో అతను ప్రతి చిన్న విషయానికి కోపం, విసుగు చెందడం జరుగుతుంది.

అందువలన తండ్రి కాగోరువారు, అయినవారు శరీర బలమును సంపాదించి ఇంద్రియములను జయించి వానిని శక్తి కేంద్రములుగా మార్చుకొనవలయును. ఉత్తమ మేధా సంపన్నుడుగా వుండుట తండ్రి కుండవలసిన ముఖ్యగుణము. మేధస్సు అనగా జ్ఞానము. జ్ఞానమున్నచోట మూర్ఖత్వము, అజ్ఞానాంధకారము వుండవు.

గృహస్థాశ్రమములో తండ్రి పాత్ర చాలా ప్రముఖమైనది. హిమాలయముల కంటే వున్నతమైన ఆశయములు కలవాడై, తన సుఖము సర్వస్వము కూడా కుటుంబ శ్రేయస్సుకై వెచ్చించే వుత్తముడు. అనితరమైన అతని కుశాగ్ర బుద్ధితో ఒక్క క్షణం కటువుగా వర్తించినా అంతలోనే స్నేహ హస్తాన్ని చూపేమాననీయుడు. అందుకే వేదంలో **॥అఘోరేణమిత్రియేణ చక్షుషా॥** అని చెప్పబడింది. అఖండ మేధావంతుడై, శక్తివంతుడై, ఇంద్రియ నిగ్రహము కలవాడై, సంస్కారవంతుడై వుండాలి ఏ గృహములో తండ్రి బుద్ధిమంతుడు కాడో అజ్ఞానాంధకారములో మునిగియుండునో ఆ గృహము వున్నతిని పొందజాలదు ప్రేమ అభివృద్ధికి కారణమైతే మోహము పతనానికి పునాది. ఆదర్శవంతుడైన తండ్రి ఎపుడూ ప్రేమతో వ్యవహరిస్తాడు, కోపము లేకుండా అందరినీ ప్రేమార్ద్ర నేత్రములతో చూచువాడు, కుటుంబ సభ్యులందరినీ స్నేహమయ దృష్టితో చూచువాడు తండ్రి.

**"ఘృతంమే చక్షురమృతమ్మ ఆసన్"** తండ్రి యొక్క ఆదర్శవంతము వేదంలో చెప్పబడింది ఆ తండ్రి నేత్రమందు స్నేహము, వాక్కునందు అమృతము వుండాలి.

ప్రపంచ పదార్థములలో పురుషార్థములు ధర్మ, అర్ధ, కామ, మోక్షములు. వీనిలో కామము పవిత్రముగా వున్నప్పుడు పురుషార్థములలో ఒకటిగా మనవాళ్ళు గుర్తించారు అది అపవిత్రమైనప్పుడు అరిషడ్వర్గము లలో ప్రథమ స్థానమునాక్రమించింది ఇట్టి కామము పవిత్రమైనదిగా వుండాలంటే తండ్రియైన వాడు సంయమి గావాలి తన యింద్రియముల

మీద, మనస్సు మీద సంయమనము లేనపుడు గృహస్థ జీవనము మనుష్యశక్తులను బలహీన పరచి శీఘ్ర మృత్యుప్రాప్తికి హేతువవుతుంది మనోనిగ్రహము వలన గృహస్థులకు శక్తి సామర్థ్యములు పెరిగి, తన గృహకార్యములను సమర్థవంతముగా నెరవేర్చుకొనగలడు ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహముకల గృహస్థుడు మాత్రమే ఉత్తమ సంతతిని కనగలడు. ఉత్తమ సంతానమే భావి భారత భవిష్యత్తుకు పునాది.

శంఇతిఓ3మ్

**ఓం స్వస్తి పంథా మనుచరేమ**
**సూర్యా చంద్రమసావివ**

**(ఋగ్వేదము)**

**భావార్థము :**

మానవులు జ్ఞానవంతులై, సూర్యచంద్రుల వలె వున్నత మార్గములో నడవాలి. సూర్యచంద్రులు ఏవిధంగా గతి తప్పకుండా నిత్యం ఒక క్రమ మార్గములో చరిస్తున్నారో, ఆవిధంగానే మనుష్యుడు తన నడతను మార్చుకోవాలి.

**న విప్రపాదోదక కర్దమాని న వేదశాస్త్ర ధ్వని గర్జితాని।**
**స్వాహా స్వధాకార వివర్జితాని శ్మశాని తుల్యాని గృహాని తాని॥**

**(చా।నీ)**

**భావార్థము :**

వేదవిదులైన బ్రాహ్మణుల పాదములు కడిగిన నీళ్ళు పారనట్టివి, వేదశాస్త్ర పఠన ధ్వని ఘోషించనట్టిది. యజ్ఞమంత్రముల చివరన వచ్చు స్వాహాకారములు లేనట్టివి గృహములు శ్మశానముతో సమానములు.

# అగ్ని హోత్రము

మానవ జీవితము ఒక సాధన. మనసా వాచా కర్మణా సాగించు క్రియలన్నీ కలిసి జీవిత మహాయజ్ఞము. పరోపకారమే జీవితానికి మూలమంత్రం కావాలి. సాధన ఎంత ఎక్కువైతే సత్యజ్ఞానము అంతగా వృద్ధిచెందుతుంది. మనిషి జీవితాన్ని సుఖమయం చేసుకోవటానికి ఈశ్వరుడు తన జ్ఞానమును వేదాల రూపంలో ప్రసాదించాడు. వేదములకు కర్త పరమేశ్వరుడు. పరమేశ్వరుడు తనను తాను తెలుసుకున్నట్లుగా అన్యులెవరూ తెలిసికోలేరు.

ఆ జ్ఞానము నిర్భ్రాంతము. అట్టి భ్రాంతి రహిత జ్ఞానము దేనియందు వుంటుందో అది అంతయు ఈశ్వరోక్తము. మనిషి జీవితాన్ని సుఖమయం, జ్ఞానమయం, విజ్ఞానమయం చేసుకొనేందుకు పరమేశ్వరుడు కొన్ని ధర్మములను వేదములలో పొందుపరచాడు.

**"ప్రేుద్యపేక్షయాత్ మనుష్యాధికారత్వాత్"** **॥వే॥ద॥**

మనుష్యుల కోసమే వేదముత్పన్నమయింది. మానవులు, జీవిత సార్థకత కోసం ఆచరించదగిన ధర్మములలో పంచ మహాయజ్ఞములు ముఖ్యమైనవి.

'యజ' అను ధాతువుతో 'యజ్ఞ' శబ్దముత్పన్నమవుతుంది. 'యజ' అనగా ముఖ్యముగా మూడు అర్థములు చెప్తున్నది శాస్త్రము. దానము, సంగతి కరణము, దేవపూజ.

దానము అనగా మానవులు తమకున్న పదార్థములేవైనా ప్రతిఫలాపేక్ష లేక ఇతరుల కొరకు అర్పించటం. సంగతికరణము అనగా వుత్తమ పదార్థ సేకరణము. ఇక మూడవది దేవపూజ. అనగా దేవతల సత్కారము. దేవతలను సంస్కరించుట అనికూడా అనవచ్చును.

సంస్కృతములో దేవత అనగా,

**"దేవోదానాద్‌నవా దీపనాద్వా ద్యోతనాద్వా అథద్యుస్థానాద్వా"**

యాస్కాచార్యుని నిరుక్త శాస్త్రము ప్రకారము దేవత అనగా దానము చేయుట, ప్రకాశించుట, ప్రకాశింపచేయుట, ద్యుస్థానమునందుండుట.

**త్రయిాస్త్రిం శతాస్తువత భూతాన్యసామ్యన్**
**ప్రజాపతిః పరమేష్ట్యాధిపతిరాసీత్** **॥యజు॥**

ఈ దేవతలు మొత్తం 33. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇంద్రుడు, ప్రజాపతి. భూమి, జలము, అగ్ని, వాయువు, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు ఇవి సమస్త సృష్టికి నివాసస్థలములు కావున వీనిని అష్ట వసువులు అన్నారు. ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అను అయిదు ప్రాణములు, నాగ, కూర్మ, కృకల, దేవదత్త, ధనంజయములను అయిదు వుప ప్రాణములునూ జీవాత్మయు కలసి ఏకాదశ రుద్రులు అన్నారు. ఇవి శరీరము నుండి వెడలిపోయినపుడు జీవులను రోదింప చేస్తాయి కావున రుద్రదేవతలు ఇక సంవత్సరములోని 12 మాసములలో సూర్యుడు ఒక్కొక్క మాసములో ఒక్కొక్క విధంగా ప్రకాశిస్తూ ప్రాణుల ఆయువును హరిస్తున్నాడు కావున ఇవి ఆదిత్య దేవతలు. పరమ ఐశ్వర్యమునకు హేతువగుటచే విద్యుత్తుకు ఇంద్రుడు అని పేరు. వాయువు, వృష్టి జలములను, ఔషధములను శుద్ధిచేయుచూ, విద్వాంసుల సత్కారమునూ, నానా ప్రకారములగు శిల్ప విద్యలకు హేతువైన యజ్ఞము ప్రజలను పాలించి, పోషించును కావున యజ్ఞమునకు ప్రజాపతి అని పేరు.

ఈ 33 దేవతలు దివ్యగుణములు కలిగి యుండుట వలన వీనికి దేవతలు అని పేరు.

**"ప్రజాపతిః పరమేష్ట్యాధిపతి రాసీత్"**

ఈ దేవతలన్నింటికీ స్వామియు, అధిపతి, అధిష్టాన దేవత

పరమేశ్వరుడు. అతడు మాత్రమే అందరికీ వుపాసించతగినవాడు. అతని నియమపాలనలోనే ఈ దేవతలన్నీ వర్తిస్తాయి. ఈ 33 దేవతలను మానవుడు విధిగా నిత్యము సంస్కరించుకోవాలి. ఆ ప్రక్రియకే దేవయజ్ఞము అని పేరు. ఈ దేవతలన్నీ కూడా ఈశ్వరుని సృష్టిలో తమ వంతు సహకారముతో మానవ మనుగడకు తోడ్పడుతున్నాయి. దేవతలను సంస్కరించుట ద్వారా మానవుడు ఈ సృష్టి రచనలో భాగస్వామ్యుడు కావాలి.

ఒక ధాతువు నుండి ఇంకొక ధాతువుకు మారే ప్రక్రియలో మన దేహము నుండి నిత్యము అనేక మలిన పదార్ధములు, వ్యర్ధపదార్ధములు విడదలవుతూ వుంటాయి. ఈ దేవతలను, మానవుడు తన జీవితమునకు వుపయోగించుకొని, మలినపదార్ధముల ద్వారా అపవిత్రం చేస్తున్నాడు. తన దేహము ద్వారా ఈ ఈశ్వర వ్యవస్థ ఎంతగా అపవిత్రమవుతుందో అంతగా పవిత్రం చేయవలసిన బాధ్యత అతని మీద వున్నది.

ఓషధులు, తీపిపదార్ధములు, పాలు, నేయి మునగు పుష్టికారక పదార్ధములు సంపాదించి, శుద్ధిచేసి తగిన పరిమాణముతో అగ్నియందు యుక్తిగా హోమ మొనర్పవలయును. అగ్నిలో వేసిన పదార్ధములు సూక్ష్మమై వాయుమండలము చేరి, తద్వారా వాయువు, వర్షజలములను పవిత్రం చేస్తాయి.

**"అగ్నిర్వై దేవానాం ముఖమ్"** ॥శబా॥

అగ్నియే దేవతలకు నోరు, అగ్నిలో వేసిన ఏ పదార్ధము వృధాకాదు. పదార్ధములను విభజించు శక్తి ఒక్క అగ్నికి మాత్రమే కలదు.

మహర్షులు పరమ వైజ్ఞానికులు. మానవ జగత్తుకు వుపకారమొనర్చు నిమిత్తము ఈ అగ్నిహోత్రమనే ప్రక్రియను ఏర్పరచారు.

**"యజ్ఞోపి తస్యైజనతాయైకల్పతే యత్రఏవం**
**విద్వాన్ హోతాభవతి'** ॥శబా॥

మానవ జగత్తుకు సుఖము కలిగించు నిమిత్తము యజ్ఞము జరుగుతుంది. సంస్కరింపబడు ద్రవ్యములను అగ్నిలో హోమమొనర్చుట

ద్వారా విద్వాంసుడైన మానవుడు స్వయంగా ఆనందిస్తాడు.

మానవుడు జగత్తుకెంతగా వుపకారము చేయునో వానికి ఈశ్వర వ్యవస్థ వలన అంతగా సుఖము ప్రాప్తించును.

బ్రహ్మాజిజ్ఞాసువులు, ఉత్తములు, యజనీయపరమాత్మను యజ్ఞముతోనే తెలిసికొనగోరెదరు అని ఋగ్వేదం కూడా చెప్తుంది. కావున అందరూ విధిగా వేద విహిత ధర్మములాచరించాలి. అదియే ధర్మం.

శంఇతిఓ3మ్

**కేవలాఘో భవతి కేవలాదీ** **(యజుర్వేదం)**

**భావార్థము :**

ఒంటరిగా తినకూడదు. సమిష్టిగా అందరితో పంచుకొని తినాలి. ఈ భావం అందరిలోనూ వుండాలి. విశాల దృక్పథం, ఔదార్యమైన మనస్సు మానవులు కలిగి వుండాలి. కష్టాలు, సమస్యలు వున్నచోట సానుభూతిని పంచాలి.

**సత్యం మాతా పితా జ్ఞానం ధర్మో భ్రాతా దయాస్వసా**
**శాంతిః పత్నీ క్షమా పుత్రః షడేతే మమ బాన్ధవాః**

**(చా॥నీ)**

**భావార్థము :**

తల్లి వంటి సత్యము, తండ్రి వంటి జ్ఞానము, సోదరుని వంటి ధర్మము, సోదరి వంటి కరుణ, భార్య వంటి శాంతి, కొడుకు వంటి సహనము ఈ ఆరును ఆత్మకు బంధువులు.

# గాయత్రి

భారతీయ సంస్కృతికి మూలాధారాలైన, ప్రాచీన వాఙ్మయమైన వేదములలో అత్యంత మహిమాన్వితముగా, సమస్త సృష్టికి కారణమై, జగత్తును ప్రకాశింప చేస్తున్న గాయత్రి మంత్రమును అతిముఖ్యముగా ప్రస్తావించడం జరిగినది. ఈ మంత్రమును యజుర్వేద, ఋగ్వేద, సామవేదములను మూడు వేదములలోనూ ప్రస్తావించారు. మన మనస్సులో కలిగే ప్రతి భావము గాయత్రియే. ప్రతి ఆలోచనకు ప్రతిరూపం గాయత్రి. ఈ అనంతజగత్తు యొక్క రచనా నిర్వహణ కార్యములు సూక్ష్మబుద్ధితో పరికించినపుడు మిక్కిలి విజ్ఞానయుక్తముగా ఎంతో నియమబద్ధముగా కనిపిస్తుంది. అటువంటి జగత్తును సృష్టించి, పాలించి, పోషించి లయింపచేయుశక్తి, పరిపూర్ణ జ్ఞానము అంతటా వ్యాపించి వున్నట్లు మనకు తోస్తుంది. ఆశక్తి ఒక నిరాకార తత్వము. ఆ శక్తి ఒక సర్వజ్ఞత్వము. ఆ శక్తి ఒక సమన్వితము. ఆ శక్తిలో ఎటువంటి లోపాలు వుండవు. ఏ దోషాలు వుండవు. అతడు ఏదీకోరడు. జీవులు కోరిన వాటికి తగిన పలములను మాత్రము ఇస్తాడు. అతడు సచ్చిదానందస్వరూపుడు. అతడు బాహ్యేంద్రియములకు గోచరించడు.

ఇంద్రియముల ద్వారా మనకు లభించు జ్ఞానము ప్రత్యక్షము. ఇంద్రియముల ద్వారా మనకు వస్తువుల గుణములు మాత్రమే తెలుస్తాయి. ఆ వస్తువుల గుణ కర్మ స్వభావములను బట్టి అది ఫలానా అన్న జ్ఞానము ఆత్మకు కలుగుతుంది. అలాగే ఆత్మశుద్ధమై, బాహ్యవిషయములు దరిచేరనీయక, నిరంతర ధ్యానిష్టుడై పరమాత్మ యొక్క గుణ, కర్మ, స్వరూప స్వభావములందు దృష్టి యుంచి, అంతర్ముఖుడైనపుడు, విజ్ఞానయుక్తమై, కాంతియుక్తమై, ప్రకాశయుక్తమై నటువంటి గాయత్రిని దర్శించగలుగుతుంది.

చాలామంది గాయత్రిని జపించాలి అంటారు. కానీ అది సరికాదు. గాయత్రిని సాధించాలి. అంతర్ముఖుడై శోధించాలి. గాయత్రి జ్ఞానానికి ప్రతీక, జ్ఞానానికి హేతువు. కేవలం గాయత్రి జపం వలన దానిని సాధించలేము. అందులోని ప్రతిపదము గూర్చి వివరిస్తూ, గాయత్రి రహస్యాన్ని ఛేదించాలి. ధ్యానంలో దానిని దర్శించాలి. అగ్నిముఖులు కావాలి. అదియే గాయత్రి యొక్క తురీయపదము నాల్గవ పదము అఖండమైనటువంటి, అభేద్యమైనటువంటి పరంజ్యోతి గాయత్రియే.

**"ఖం వాయుర్జ్యోతి రాపః వృధివీ విశ్వస్యధారిణీ"** సమస్త చేతనా చేతన పదార్థములలో వ్యాపించి తేజస్వంతమైన పదార్థము గాయత్రియే.

**"యదతః పరోదివోజ్యోతిర్దీప్యతే విశ్వతః"** ద్యులోకమునకు పరమున ఏజ్యోతి ప్రకాశించుచున్నదో అదే జ్యోతి విశ్వమంతా ప్రకాశిస్తుంది. ఇందులో జ్యోతి పదము, విజ్ఞాన స్వరూపమైన గాయత్రియే.

**"గాయత్రి వా ఇదం సర్వం భూతం యదిదం కించ"** సమస్త భూత ప్రపంచ మంతయు గాయత్రియే. ఆ గాయత్రియే ఆరు విధములైన భేదములతో నొప్పియున్నదని మహర్షులు ప్రవచించారు.

**"సై షా చతుష్పధా షడ్విధా గాయత్రి"** వాక్కు, పృధివి, శరీరము, భూతము, ప్రాణము, హృదయము.

**"గాయం తాం చ త్రాయతే ఇతి గాయత్రి"** దీనిని గానం చేసినందు వలన రక్షణ కలుగుతుంది. కావున గాయత్రి పదము ద్వారా ప్రతిపా దింపబడు నిరాకార విజ్ఞానయుక్త, ప్రకాశయుక్త పరబ్రహ్మనే ఉపాసించాలి.

గాయత్రి అనగా పరబ్రహ్మ బోధకము. ఆ పరబ్రహ్మ యందు మనస్సు లగ్నము చేయుటకే మంత్రమునకు ముందు ప్రణవమును చేర్చటం జరిగినది. ఈ ప్రణవము ద్వారా సమస్త ప్రాణములు ఊర్ధ్వగమనము లవుతాయి. ఆ ప్రాణముల నియంత్రణ ద్వారా మనస్సును స్వాధీన మొనర్చుకొని బుద్ధిని స్థిరం చేసుకోవాలి. ఆవిధంగా గాయత్రిని సాధించాలి.

**"విజ్ఞాన మానందం బ్రహ్మ రాతిర్ధాతుః పరాయణమ్"** విజ్ఞాన మయమైన సర్వమునకు ఆ గాయత్రియే పరాయణము. మూడు పదములు గల ఈ మంత్రంలో **"తత్ సవితుర్ వరేణ్యమ్"** లో సవితా శబ్దము సృష్టికర్త యైన పరమేశ్వరునే బోధిస్తుంది. ఈవిధంగా మనస్సులో కలిగే ప్రతి భావానికి ప్రతిరూపం గాయత్రి మంత్రంలో కనిపిస్తుంది. ఒకే విషయానికి చెందిన బాహ్యరూపాన్ని పదమని, దాని అంతర్భాగాన్ని అర్థమని చెప్తాం. ఉచ్చారణ ద్వారా పదములో ఉన్న అంతర్భాగాన్ని సాధించాలి. యోగాభ్యాసాది ప్రక్రియలు, శుద్ధ స్వాతిహారము ఈ గాయత్రి సాధనకు ఉపకరిస్తాయి.

శంఇతిఓ3మ్

**ఓం ఆనో భద్రాః క్రతవో యన్తు విశ్వతో**
**అదబ్ధాసో అపరీతాస ఉద్భిదః**
**దేవానో యథా సదమిద్ వృధే**
**అసన్న ప్రాయువో రక్షితారో దివేదివే**

**(యజుర్వేదం)**

**భావార్థము :**

ఓ పరమేశ్వరా ! మేము ఎల్లప్పుడూ ఉత్తమ కర్మలు చేయుదుము గాక. అవి మాకు శుభప్రదమై, సౌభాగ్యవంతమై, ఉత్సాహవంతమై, ప్రేరణదాయకములు అగును గాక. సమస్త దిక్కుల నుంచి ఉత్తమ ఆలోచనలు మమ్ములను సదా కాపాడుగాక.

# భారతంలో ధర్మం

మానవుడు తన జీవితంలో ఒక సాధారణ వ్యక్తి నుండి మహోన్నత వ్యక్తిగా అత్యున్నత స్థానమునధిరోహించినపుడే అతడు మహామనీషి కాగలడు. భారతంలో శ్రీకృష్ణుడు ఎక్కువగా జ్ఞాన, కర్మల గురించి చెప్పాడు. ధర్మాచరణము నకు అతడు పెద్దపీట వేశాడు. జ్ఞాన, కర్మల సమన్వయాన్ని అతడు సమర్థించటమే కాక ధర్మాచరణము వలననే భగవంతుని వుపాసించవలెనని కూడా బోధించాడు. ధర్మాత్ములైన పాండవులతో స్నేహం చేసి, బంధుత్వంతో బంధాన్ని మరింతగా పెంచుకొని, అనుక్షణం వారిని కాపాడుతూ వచ్చాడు.

కురువృద్ధుల్లో భీష్ముడు, ద్రోణుడు, కృపాచార్యుడు తదితర పెద్దలెంతమంది వున్నా వారిలోని స్వార్థం, కృష్ణుడిని వారివైపు వెళ్ళనివ్వలేదు. భీష్ముడు అఖండమైన బ్రహ్మచర్యాన్ని పాటించి, శాస్త్రాల్ని శోధించినప్పటికీ అతనిలోని స్వార్థం అధర్మం వైపు వుండేలా చేసింది అతను యుద్ధనైపుణ్యంలో అద్వితీయుడు. అనుశాసన పర్వంలో ధర్మరాజుకు చేసిన ధర్మబోధ భీష్ముడి సూక్ష్మబుద్ధికి నిదర్శనము. కానీ అతని బ్రహ్మచర్య దీక్ష అనుకోని పరిస్థితుల వల్ల జరిగినదికానీ, ఒక లక్ష్యం కోసమో, ఒక స్ఫూర్తి కోసమో జరిగినది కాదు. స్త్రీలోలుడైన శంతన మహారాజు కాముకమును తీర్చుటకు అతను సహాయపడ్డాడు. రాజు తన సర్వస్వమును త్యాగము చేసి రాజ్యాన్ని, ప్రజలను సుభిక్షంగా పాలించటానికి మారుగా, తండ్రి కోరికను తీర్చటానికి సహాయపడ్తూ, తను సింహాసనానికి దూరంగా వుండి, మత్స్యరాజు కుమార్తె సత్యవతికిచ్చి వివాహం చేయించాడు.

**“యతో అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధిః సధర్మః”** ఏకర్మాచరణము వలన అభ్యుదయము, సామాజిక అభ్యున్నతి, పరమసుఖం కలుగుతుందో అదియే పరమధర్మం అని వైశేషిక దర్శనంలో కణాద మహర్షి చెప్తాడు. మరి భీష్ముడు

చేసిన ఈ కర్మ వలన అభ్యుదయము లేకపోగా ధర్మం క్షీణించటం మొదలు పెట్టింది. ఈనాటి మనదేశ పరిస్థితులకి నాటి మహాభారత సంగ్రామమే కారణం కాదా ! అంతేకాక వివాహమనేది సమాన గుణకర్మ స్వభావములు కలిగిన వారితోనే జరగాలని ధర్మం చెప్తుంది.

**"కామ మామరణాతి ష్టేత్ గృహేకన్యర్తుమత్యపి**
**నచైవానాం ప్రయచ్ఛేత్ గుణమీనాయ కర్హిచిత్"**

స్త్రీ పురుషులు మరణపర్యంతము బ్రహ్మచారులుగా నుండినను వుండవచ్చు కానీ, పరస్పర విరుద్ధ గుణ కర్మ స్వభావములు కలవారికి వివాహ మెన్నటికి కాకూడదు. దానివలన కలుగు సంతానము దుర్భలము, నిస్తేజమవుతుంది.

**స్థిరావః సన్త్వాయుధా పరాణుదే వీళూ ఉత ప్రతిష్కభే**
**యుష్మాకమస్తు తవిసే పనీయసీ మామర్త్యస్యమాయినః॥ఋగ్॥**

క్షత్రియ పురుషులు శత్రువులను ఓడించుటకు ఆగ్నేయాద్యస్త్రములు, శతఘ్నులు మొదలగు బలవంతమైన అస్త్రములు ప్రయోగించాలి. దృఢమైన అస్త్రములు ప్రయోగించినపుడే సేన బలోపేత మవుతుంది. క్షత్రియుడు ధార్మికుడుగా వున్నప్పుడే రాజ్యము వృద్ధి చెందుతుంది అని పై ఋగ్వేద మంత్రాభిప్రాయము.

సర్వోత్తమ గుణకర్మ స్వభావయుక్తుడైన వాడే రాజు కావాలని వేదం చెప్తున్నది. క్షణికమైన కోరికల కోసం తపించే తండ్రికి సహాయపడేవాడు భీష్ముడు. అంతేకాక కౌరవుల పక్షం అన్యాయమని తెలిసినా భీష్ముడు వారి పక్షమునే యుద్ధము చేసి పరాజితుడయ్యాడు. అందుకు కారణం **"అర్థస్య పురుషో దాసః"** తాను అర్థానికి దాసుడైనట్లు స్వయంగా తన అసహాయతను ఒప్పుకోవటం జరిగింది.

నిండు సభలో ద్రౌపదికి జరుగుతున్న అమానుష కృత్యాన్ని చూస్తూ కూడా, ఒక పెద్దవానిగా, అఖండ బ్రహ్మచర్యమును పాలించు తేజోవంతునిగా, అద్వితీయ వీరునిగా, కర్తవ్యాకర్తవ్యముల జ్ఞానము కలవానిగా కూడా

స్పందించలేదు.

ధర్మానికి రెండు రూపాలుంటాయి. ఒకటి శాశ్వత ధర్మము, రెండు వ్యావహారిక ధర్మము. ఈ రెండు పరస్పరము సమానము కావు.

భీష్ముడు తన తండ్రికి, సత్యవతికి చేసిన వివాహ పర్యవసానం బలహీనమైన సంతానం. ఆ సంతానము కూడా అకాల మరణంతో వ్యాకులం చెందిన భీష్ముడు నియోగ పద్ధతి ద్వారా సంతానాన్ని లభింప జేస్తాడు. ఆ సంతానం కూడా దుర్భలమే.

గుడ్డివాడైన ధృతరాష్ట్రుడు, కళ్ళుండి కూడా పతివ్రతా ధర్మంతో గుడ్డితనాన్ని కోరి వరించిన గాంధారి. భర్త అంధుడైతే తాను ఆ బాధ్యత తీసుకొని పుత్రులను, ప్రజలనూ చూసుకోవలసిన స్త్రీ, గుడ్డితనాన్ని కోరి తెచ్చుకొన్న మాతృమూర్తి. వీరికి పుట్టినవాడు మరొక బల సంపన్నుడు, కానీ మూర్ఖుడు. **"జానామి ధర్మం నహిమే ప్రవృత్తి, జానామి అధర్మనహిమే నివృత్తి"** ధర్మం తెలుసు కానీ ఆచరించను. అధర్మం తెలుసుకానీ దాన్ని విడిచిపెట్టను అని ఘంటాపథంగా చాటిన దుర్యోధనుడు.

తల్లిదండ్రుల పర్యవేక్షణ, సుశిక్షణ, పాలన, నియంత్రణ లేక పరమ మూర్ఖునిగా తయారైన స్వాభిమాని.

**"మాతృమాన్ పితృమాన్ ఆచార్యవాన్ పురుషో వేదః"** తల్లి, తండ్రి, ఆచార్యుడు ఈ ముగ్గురే సంతానమునకు శిక్షణ నిచ్చేవారు అని శతపథ బ్రాహ్మణము చెప్తున్నది. వారి శిక్షణలోనే సంతానము సుశీలురుగాను, శుభగుణయుక్తుల గానూ తయారు కావాలి. ఇదియే తల్లితండ్రులకు, ఆచార్యులకు పరమధర్మమని వేదం.

ఈ ముగ్గురు తప్ప ఇతరులెవరైనా వారికి భృత్యులే అవుతారు కానీ, అధికారి మాత్రం కాజాలరు. పరిపాలనా వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న భీష్ముడు కనీసం ఈ ధర్మం కూడా గాంధారికి బోధించలేదు.

ఇందరి మధ్య భారతజాతిని వుద్ధరించుటకు కంకణం కట్టుకొని ధర్మాన్ని రక్షించటానికి పాండవులతో మైత్రి గొలిపి ఎట్టకేలకు ధర్మాన్ని సాధించిన

శ్రీకృష్ణుడు మహా త్యాగశీలి.

నిండుసభలో ద్రౌపిని అవమానిస్తుంటే, బలవంతుడేది చేస్తే అదే ధర్మమని సమర్థించిన జ్ఞానవంతుడు భీష్ముడు. అందుకనే శాశ్వత ధర్మము ప్రకారము అతనిని వధించటానికి సన్నాహం చేస్తాడు శ్రీకృష్ణుడు.

మానవుడు ఏ కర్మ చేయటానికైనా స్వతంత్రుడు. అందులో తిరుగులేదు.

**"స్వతంత్రః కర్తాః"** ॥వ్యాసూ॥

కానీ అందులో ఒక తిరకాసుంది. ఏ కర్మ చేసినా శాస్త్రం ప్రమాణంగా తీసుకొమ్మని చెప్తారు. అందుకే భగవద్గీతలో కృష్ణుడు దానిని సమర్థిస్తాడు.

**"యచ్ఛాస్త్ర వినిముర్తస్య వర్తతే కామకారతః"**
**న స సిద్ధి మవాప్నోతి న సుఖమ్న పరాంగతిం"**

శాస్త్ర విషయములను అనుసరింపక ఇచ్ఛామార్గమున ప్రవర్తించువారు పరమ సుఖమును పొందలేరు. కర్మలాచరించేటపుడు మనం బుద్ధికి పదును పెట్టాలి.

**"బుద్ధిఃజ్ఞానేన శుధ్యతి"** ॥మను॥

జ్ఞానము వలననే బుద్ధి పవిత్రమవుతుంది. కాబట్టి కర్మలు చేయటానికి శాస్త్ర విషయములు క్షుణ్ణంగా చర్చించాలి. ఈ శాస్త్ర విషయములలో ఎక్కడైనా విరోధం అనిపిస్తే, వేదమే ప్రమాణంగా తీసుకొమ్మని ధర్మశాస్త్రం చెప్తుంది.

**"శృతి స్మృతి విరోధేతు శృతిః ఏవ గరీయసి"**

కాబట్టి మానవులు ధర్మాచరణ పరాయణులు కావలయుననిన ఒకటి రెండు సార్లు ఆలోచించి, వివేచించి బుద్ధితో తర్కించుకొని చేసుకోవాలి.

**"చోదనా లక్షణోర్థః ధర్మః"** ॥వేద॥

ధర్మం యొక్క లక్షణమే శోధించటము. మరి అది ఆచరించినపుడే కదా శోధించబడేది.

ఏ మనుష్యులు శీలం లేనివారు, సదాచారంలేనివారు, శిష్టాచారులు కానివారు, ఇతర వర్గ స్త్రీలతో సంపర్కం పెట్టుకొనేవారు అల్పాయుష్కుల గుటయే కాక, మరణించిన తరువాత కూడా నరకంలో వుంటారని ఒకానొక సందర్భంలో ధర్మరాజు అడిగిన ప్రశ్నకు భీష్ముడు సమాధానం చెప్తాడు. ధర్మరాజు సత్యవ్రత సంపన్నుడు. సత్యమును, సదాచారమును ఆచరించుటలో ప్రమాదం చేయడు. అంతటి సత్యవాది కావుననే అతనిని అందరూ గౌరవించేవారు. కాని అంతటి వ్యక్తి కూడా విజయం సాధించాలనే తలంపుతో అసత్యమాడవలసి వచ్చింది. దానివలన అతని సత్యవ్రతదీక్ష కలుషిమవుతుంది. కానీ ఎందుకు అసత్యం పలికాడు?

కౌరవుల సేనాధ్యక్షుడు ద్రోణాచార్యుడు. అతను అఖండ ధనుర్విద్యా పారంగతుడు. ఆయనను జయించుటకు ఒక్క పాండవులకే సాధ్యం అని శ్రీకృష్ణుడికి తెలుసు, కనుక కృష్ణుడు అశ్వత్థామ చనిపోయాడన్న వార్తను ప్రచారం చేస్తాడు. అశ్వత్థామ ద్రోణాచార్యుని కొడుకు. ధర్మరాజు చెప్తేనే కాని తాను నమ్మనంటారు ద్రోణాచార్యుడు. అపుడు అశ్వత్థామ చనిపోయాడను వార్తను ధర్మరాజును చెప్పమంటాడు కృష్ణుడు. కానీ ధర్మరాజు ససేమిరా అంటాడు. అప్పుడు కృష్ణుడు ధర్మరాజుతో కూడా ఒక్క ఎత్తు వేస్తాడు. సందేహాస్పదంగా ఒక విషయాన్ని ఆడటంలో దోషం లేదని చెప్పి ఒప్పిస్తాడు.

**'అశ్వత్థామా మృతః నరో వా కుంజరః'** అశ్వద్ధామ చనిపోయాడు, నరుడో, కుంజరమో తెలియదు అని అర్థం. అశ్వత్థామ అను ఏనుగొకటి కౌరవుల సైన్యంలో వుంటుంది. అదికూడా నీవు పలుకకపోతే ఓడిపోతావు, ప్రజలు నిన్ను నిందిస్తారు అని చెప్పి కృష్ణుడు ధర్మరాజును ఒప్పిస్తాడు. ధర్మం కోసం, సత్యం కోసం శ్రీకృష్ణుడు, పాండవులు పడ్డ శ్రమ అంతా ఇంతా కాదు.

ధర్మాన్ని ఆచరించటానికే మానవులు దృఢ దీక్ష తీసుకొని, ఏ కర్మ

అయినా ఒకటికి రెండుసార్లు ఆలోచించి బుద్ధితో తర్కించుకొని, శాస్త్ర విషయములను పరిశీలలించి చేయుట ఉత్తమము. మనం చేస్తున్న ప్రతిపని యొక్క జ్ఞానం మన హృదయం మీద సంస్కారరూపంలో ముద్రించబడుతుంది అన్న విషయం మరచిపోకూడదు.

శంఇతిఓ3మ్

**ఓం యాం మేధాం దేవగణాః**
**పితరశ్చోపాసతే ।**
**తయా మా మద్య మేధయాగ్నే**
**మేధావినం కురు ॥** **(యజుర్వేదం)**

**భావార్ధము :**

ఓ జ్ఞానరూప పరమేశ్వరా ! మా పూర్వీకులు, జ్ఞానులు, ఉత్తములు, సంస్కారవంతులు, విద్వాంసులు, ఏ మేధస్సు కొరకై, ఏ జ్ఞానముతో నిన్ను ఉపాసించారో, ఆ మేథాశక్తిని, ఆ జ్ఞానమును మాకునూ ప్రసాదించి మమ్ములను మేధావంతులుగా చేయుము.

**కాలః పచతి భూతాని కాలః సంహరతే ప్రజాః**
**కాలః సుప్తేషు జాగర్తి కాలో హి దురతి క్రమః**
**(చా।నీ)**

**భావార్ధము :**

కాలము ప్రాణులను జీర్ణము చేయుచున్నది. కాలమే ప్రజలను నాశనము చేయును. సమస్త పదార్థములు నశించినను, కాలము మాత్రము నిలిచివుండును. నిశ్చయముగా కాలము నెవ్వడూ అతిక్రమించలేడు.

# భారతీయ సంస్కృతి - వేదములు - 2

భారతీయ సంస్కృతికి వేదములు పునాదులు. ఏ కట్టడమైనా పునాదులు శక్తివంతంగా వుంటేనే అది నాలుగు కాలాల పాటు మనగులుగుతుంది. ఆధ్యాత్మికంగా మనదేశం ఇంత పటిష్టంగా వున్నదంటే దానికి కారణం ఈ భూమి మీద వుద్భవించిన మహానుభావులు, మహర్షులు, జ్ఞానులు, విజ్ఞానులు. అంత శక్తివంతమైన సంస్కృతి కావున ఈ దేశ సంస్కృతి అందరినీ ఆకర్షిస్తున్నది. లోకంలో ఏదైనా ఒక శక్తివంతమైన పదార్థముంటే దానిని అందు కోవటానికి, ఆ శక్తిని సాధించటానికి అందరూ ప్రయత్నం చేయటం సహజం. అలాగే మన దేశపు సంస్కృతి శక్తులను వశపరచుకోవటానికి ప్రపంచదేశాలు సైతం శతవిధాలుగా ప్రయత్నాలు సాగించి, విఫలులై, తిరిగి తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయనుటలో సందేహం లేదు.

వేదముల ద్వారా, మానవునికి జన్మతః సంక్రమించిన దోషములను నివారింప చేసి, జ్ఞానం వైపు మళ్ళించి, ఆధ్యాత్మికంగానూ, భౌతికంగానూ శక్తివంతుని చేసే సంస్కృతి మనది. సర్వశక్తిమంతుడు, పరమేశ్వరుడు సృష్టి ఆరంభంలో అగ్ని, వాయువు, ఆదిత్య, అంగిర అను నలుగురు శుద్ధ అంతఃకరణులైన ఋషుల హృదయములలో ప్రకాశింపచేసినవి నాలుగు వేదములు. అవి ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వవేదము.

**అగ్నిర్వాయు రవిభ్యస్తు త్రయమ్ బ్రహ్మ సనాతనమ్**

అని మను ధర్మశాస్త్ర ప్రమాణము. **॥మను॥**

**సూర్యాచంద్ర మసౌ ధాతా యధా పూర్వమ కల్పయత్ ॥ఋగ్॥**

సర్వాధారుడగు పరమేశ్వరుడు ప్రతి సృష్టి ఆరంభంలో తనకు

సమీపమైన మహదహంకారాది కారణరూప ప్రకృతిని ఏవిధంగా రచిస్తున్నాడో, అదేవిధంగా మానవులకు మోక్షకారకములై, సత్కార్యము లందు ప్రవృత్తి కలుగుటకు, దుష్కార్యములందు నివృత్తి కలుగుటకు సుస్వరములు, సార్థకములు అయిన మంత్రములను మహర్షుల హృదయము నందు ప్రకాశింపచేసాడని వేదం చెప్తోంది. ఆ మంత్రములను తమ తపస్సమాధి యందు దర్శించి మహర్షులు మంత్ర ద్రష్టలైనారు. అంతేకాని మహర్షులు మంత్రకర్తలు కారు.

**తస్మాత్ యజ్ఞాత్ సర్వహుతః ఋచః సామాని జజ్ఞిరే**
**ఛ ం దాం సి జజ్ఞిరే తస్మాత్ యజుస్తస్మాద్ అజాయత ॥ఋగ్॥**

భగవంతుడు సత్యము. ఆత్మ సత్యము. ఈ ప్రకృతి సత్యము. భగవంతుని ద్వారా ప్రదత్తమైన వేదవాణి కావున వేద ధర్మాచరణము వలన కూడా సత్యమే ప్రాప్తిస్తుందనుటలో సందేహం లేదు. వేదమొక మహాకావ్య మనవచ్చును.

**పశ్యదేవస్వ కావ్యం న మమార నజీర్యతి ॥అధర్వ॥**

భగవంతుడు స్వయంగా చేసిన కావ్యం కావున దానికి మరణం, క్షీణము వుండవు. మానవులు తెలిసికోలేనంత మాత్రమున జ్ఞానము లేకుండా పోదు.

అనంత శక్తియుక్తుడైన పరమేశ్వరుని వలననే వేదములు ఉత్పన్న మయ్యాయనడానికి ఈ క్రింది మంత్రమే ప్రమాణం.

**ఋతం చ సత్యం చాబీద్ధా త్త పసో ధ్యజాయత ॥ఋగ్॥**

సమస్త ధర్మములకు మూలం వేదము. వేద ధర్మములను ఆచరించుట వలన మానవులు అత్యున్నతమైన, అమితశక్తివంతమైనటువంటిది అయిన ఆ భగవద్ జ్ఞానాన్ని పొంది, కళ్యాణ కారకమైన జీవితమనే సేతువు దాటి, సమస్త లోకములకు ఆవల ప్రకాశిస్తున్న పరంజ్యోతిలో తాదాత్మ్యం చెందటానికి దోహదం చేస్తుంది. అదియే మోక్షము. మోక్షమనగా

అనిర్వచనీయమైన సుఖము, దుఃఖానికి సంబంధం లేనటువంటి సుఖము అవ్యక్తానందానుభూతి. అటువంటి సుఖము కేవలం అవ్యక్తము, అద్వితీయము, అఖండమై వెలుగొందు ఆ పరమేశ్వరుని సన్నిధిలో మాత్రమే పొందగలము. తత్‌ప్రాప్తికి సేతువులైన వేద ధర్మములుద్భవించిన ఈ ఆర్యావర్తనము నందు ఎంతోమంది బ్రహ్మజ్ఞానులు ధ్భవించారు. వారి నుంచి సమస్త జ్ఞానాన్ని పొందమని ఆహ్వానిస్తూ ప్రాచీన ఋషులు అతి ప్రాచీన కాలంలోనే పిలుపు నిచ్చారు.

**ఏతద్దేశ ప్రసూతస్య సకాశా దగ్ర జన్మవః**
**త్వంత్వం చరిత్రం శిక్షేరన్ పృధివ్యాం సర్వమానవః ॥మను॥**

ప్రపంచ చరిత్రను పరిశీలించిన ఏ దేశమందునూ జన్మించనంత ఎక్కువగా జ్ఞానులు, విజ్ఞానులు, తపోధనులు, వీరులు, వీరవనితలు, విద్వాంసులు జన్మించిన దేశం యిది. అందుకే ఈ దేశంలో జన్మించిన ప్రతివ్యక్తి తన దేశమును మాతృభూమిగా, పుణ్యభూమిగా ఎంచి తన గౌరవ మర్యాదల కన్నా దేశ గౌరవ ప్రతిష్ఠలను మిన్నగా భావించినప్పుడే అతని హృదయంలో జ్ఞానమనే సూర్యుడు ప్రకాశిస్తాడు. లోక కళ్యాణం తప్ప మరో సంకల్పం లేని మహర్షులు తాము కన్న తత్వాన్ని ప్రజలకు బోధిస్తున్నారు. ఆ తత్వాన్ని మీరు దర్శించండని లోకాన్ని ఆహ్వానిస్తున్నారు.

**శృణ్వంతు విశ్వేదేవాః అమృతస్యపుత్రాః**
**ఆయే దామాని దివ్యానితస్తు**
**వేదాహమేతం పురుషం మహంతం**
**ఆదిత్యవర్ణం తమసః పరస్తాత్ ॥శ్వేతా॥**

దివ్యలోక నివాసులైన ఓ అమృత పుత్రులారా ! అజ్ఞానాంధకారానికి ఆవల ప్రకాశించుచున్న ఆ పరంజ్యోతిని దర్శించండి. ఆ పరమ పురుషుని కనుగొనుటే తరించే మార్గము. వేరు మార్గము లేదు.

మనిషి ఎప్పుడూ సత్యాన్ని కోరతాడు. దాని అనుభవం కోసం అతని మనసు పరితపిస్తూ వుంటుంది. అసత్యాన్ని దర్శించినపుడు, అంతః

కరణంలో ఆ అనుభవాన్ని చవిచూసినపుడు సమస్త సంశయములు వీడి, సమస్త కర్మలు నశించి, విజ్ఞాన, ఆనంద, సుఖస్వరూపుడైన ఆ పరమేశ్వరుడు తప్ప అన్యులు అతనికి గోచరించరు.

**బిధ్యంతే హృదయ గ్రంధిః ఛిద్యంతే సర్వసంశయాః**
**క్షీయంతే చాస్య కర్మాణి తస్మిన్ దృష్టే పరావరే**

సర్వమునకు ఆధారభూతుడైన ఆ పరమేశ్వరుని పొందటానికే వేదాది శాస్త్రాలు వుద్భవించాయి. మానవుల కోసమే వేదాది శాస్త్రాలు రూపొందించారు.

**"హృద్యపేక్షయాత్ మనుష్యాధి కారత్వాత్"** ॥బ్రాసూ॥

శాస్త్రవిషయములను అనుసరించకుండా ఇచ్ఛామార్గమున ప్రవర్తించువాడు పరమ సుఖమును, శాంతిని పొందలేరు అని భగవద్గీత చెప్తుంది.

**యశ్చాస్త్ర విని ముర్త్తస్య వర్తతే కామకారతః**
**న స సిద్ధిః మవాప్నోతి న సుఖం న పరాంగతిం** ॥భ।గీ॥

ధర్మము వర్ధిల్లాలి అని అందరూ కోరుకుంటారు. కానీ ఆ ధర్మం ఆచరించినపుడే కదా అది వర్ధిల్లేది. ఎందుకంటే ధర్మం దానంతట అది లభించేది కాదు. లోకంలో మానవులు పురుషార్థులై వర్తించినపుడు అధర్మం వర్ధిల్లుతుంది. చతుర్విధ పురుషార్థాలు శాస్త్రాల్లో చెప్పారు. ధర్మ, అర్థ, కామ, మోక్షములు. ధర్మబద్ధమైన జీవితాన్ని నడుపుచూ, డాంభికమునకు, అభిమానమునకు దూరులై, న్యాయార్జితమైన ధనార్జనతో, జీవించడానికి అనువైనకోరికలను తీర్చుకుంటూ మృత్యువు నుంచి తరించటమే మోక్షం.

**ఆహార నిద్రాభయ మైధునాని సామాన్యమేతత్ పశుభిః నరాణాం ధర్మహితే షాం అధికో విశేషః ధర్మేణ హీనాం పశుభిః సమానాం**
**॥వి।చూ॥**

ఆహారం, నిద్ర, భయం సంతానోత్పత్తి ఇవి అన్నియు మానవులలోనూ, జంతువులలోనూ సమానమే. కేవలం ధర్మగుణమొక్కటే మానవుని, ఇతర ప్రాణుల నుంచి వేరు చేస్తుంది. కావున ధర్మాన్ని ఆచరించటం వలననే మానవులు గా పరిగణింపబడతారు అని జగద్గురు ఆదిశంకరాచార్య చెప్తారు.

**"కేవలా ఘో భవతి కేవలాది"** **॥యజు॥**

ధర్మము నాచరించక భుజించేవారు కేవలం పాపమును భుజించిన వారవుతారు అని యజుర్వేదం చెప్తోంది. ఏ దేవతల నుండి తాను ఆహార పదార్థాలను గ్రహించి, తిరిగి ఆయా దేవతలను సంస్కరించకుండా భుజించేవాడు దొంగే అని భగవద్గీత చెప్తుంది. అందుకే వేదంలో

**"వేదోదితం స్వకం కర్మనిత్యం కుర్యాత్ అతంద్రితః"॥యజు॥**

అలసతను వీడి నిత్యం వేద విహిత కర్మలు ఆచరించాలి. ధర్మ శాస్త్రాలు దర్మోపదేశం చేస్తాయి. పరమేశ్వరుడు నిత్యుడు. అతని జ్ఞానము నిత్యము. అందువలన అతని సంపద కూడా నిత్యమే కావలసియున్నది. మనకు కనపడే ఈ సృష్టి, అందు కర్మఫలమనుభవించే జీవులు అతని సంపద. కావున అవి కూడా నిత్యమే. జీవులు భోక్తలు. ప్రకృతి భోగ్య పదార్థము. జీవులకు తాము చేసుకున్న కర్మలకు అనుగుణమైన ఫలితమనుభవిం చేందుకు వీలుగా మంచి చెడులను బోధించు శాసనము అవసరము. ఆ శాసనములే వేదములు. ఈ జగద్విజ్ఞానమే వేదము.

ఈ సృష్టిలో ప్రతి పదార్థము ఏవిధంగా సృష్టింపబడి, తిరిగి ఏవిధంగా పోషింపబడి, అట్లు పోషింపబడిన పదార్థములు ఏవిధంగా తమ పూర్వపు స్థితిని పొందగలుగుతున్నాయో, ఆవిధంగానే వేదములు కూడా ప్రవాహ నిత్యములు అని శాస్త్రాలు చెప్తున్నాయి.

**అత ఏవచ నిత్యత్వమ్** **॥పూ॥మీ॥**

**భూతస్య జాతః పతిః ఏక ఆసీత్** **॥యజు॥**

సమస్త భూత జాతమంతటికినీ భగవంతుడు ఒక్కడే.

**'యో భూతవంచ భవ్యంచ సర్వం యశ్చాదితిష్టతి' ॥అథర్వ॥**

సమస్త భూత జాతమంతటికినీ భగవంతుడు ఒక్కడే.

**యస్మిన్ భూమిః అంతరిక్షం దౌః అస్మిన్ అధ్యాహితా ॥అథర్వ॥**

పృధివి, అంతరిక్ష, ద్యులోకములు అన్నియు అతని యందే వున్నవి అని అథర్వవేదం.

**న తత్ర సూర్యోభాతి న చంద్ర తారకమ్ ॥కఠ॥**

సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు అన్నియు అతని వునికి వలననే ప్రకాశించుచున్నవి. పరమేశ్వరుడు, విశ్వనియంత, విశ్వకర్త లేకున్న ప్రకాశింపలేవు.

జీవులు, ప్రకృతి, పరమాత్మల గురించి తరువాత తెలిసికొందాం.

శంఇతిఓ3మ్

**భయా దస్యాగ్ని స్తపతి**
**భయాత్తపతి సూర్యః ।**
**భయా దింద్రశ్చ వాయుశ్చ**
**మృత్యుర్ధావతి పంచమః ॥ (కఠోపనిషత్తు)**

**భావార్థము :**

ఆ భగవంతునికి భయపడదే అగ్ని జ్వలిస్తుంది. సూర్యుడు తపిస్తున్నాడు. విద్యుత్ మెరుస్తుంది. వాయువు వీస్తుంది. మృత్యువు కూడా సమస్త ప్రాణులను సంహరింప నిరంతరం పరుగులు పెడుతుంది. అందుకే మానవుడు పరమాత్మునికి, పాపానికి భయపడాలి. ధర్మానికి, సత్యానికి కట్టుబడి వుండాలి.

# అహింసా సిద్ధాంతము

**'మనో అవబోధనే'** అనే ధాతువు నుండి మానవశబ్ధము వుత్పన్నమ వుతుంది. అవబోధన మనగా జ్ఞానము. జ్ఞానము కలవాడు కాబట్టి మానవుడు అంటుంది శాస్త్రము. **'మత్వా సీవ్యంతి కర్మణి'** ఆలోచించి కర్మలు చేస్తాడు కాబట్టి మానవుడు, మనుష్యుడు అనబడుతున్నాడు.

కర్మలు అంటే పనులు

**"యత్ క్రియతే తత్ కర్మః"** ఏది చేయబడుతుందో అది కర్మ.

శాస్త్రము వేదవిహిత కర్మలను మాత్రమే కర్మలుగా అంగీకరిస్తుంది.

*ఈ కర్మలు మూడు విధములు.*

**నిత్య కర్మలు** : నిత్యం మనం ఆచరించదగిన వేదవిహిత కర్మలు
**నైమిత్తిక కర్మలు** : ఒక నిమ్తితంతో చేసేవి అనగా యజ్ఞయాగాది క్రతువులు.
**కామ్యకర్మలు** : కొండొక ఫలం కోరి చేసేవి.

**"సంగచ్ఛద్వం సంవదధ్వం సంవోమనాంసి జానతామ్" ॥ఋగ్॥**

కలసినడవండి, కలసిమాట్లాడండి, ఆలోచనలో ఒక్కటిగా వుండండి. ఒకటిగా కలసి యోచన చెయ్యండి. అలాగే వేదంలో, కొన్ని నిషిద్ధకర్మలు కూడా చెప్పబడినాయి.

**అక్షైర్మాదీవ్యః ! గాంమాహీంసీ ! అవీంమాహీంసీ,**
**అజాంమాహీంసీ, మాహీంసీ సర్వాభూతానీ**

జూదమాడవద్దు. గోవును హింసించవద్దు. గొర్రెను హింసించవద్దు. మేకను హింసించవద్దు. ఏ ప్రాణినీ హింసించవద్దు. నిషిద్ధకర్మలు సంఘానికి

హానికారకములు. హింస, దొంగతనము, అసత్యమాడుట, వ్యభిచారము ఇలాంటివి సమాజాన్ని అశాంతిపాలు చేస్తాయి. అహింస ద్వారానే మానవుడు మోక్షానికి అర్హుడవుతున్నాడు. అందుకే పతంజలి మహర్షి యోగదర్శనములో ఇలా చెప్తాడు.

**"తత్రాహింసా సత్యమస్తేయం బ్రహ్మచర్యమపరిగ్రహాః"**

వ్రతములలో ఆచరించవలసిన మొదటి వ్రతము 'అహింస'.

**"సర్వదా సర్వథా సర్వాభూతాని అనభిద్రోహః అహింస"**

**॥మ॥భా॥**

ఎల్లప్పుడు, సర్వవిధములా ఎల్లప్రాణుల ఎడ వైరభావం లేకుండుటే అహింస.

**'ఓ3మ్ దృతేదృంహ మా మిత్రస్య**
**మా చక్షుషా, సర్వాణి భూతాని సమీక్షన్తామ్**
**మిత్రస్యాహం చక్షుషా, సర్వాణి భూతాని సమీక్షే**
**మిత్రస్యచక్షుషా సమీక్షామహే' ॥యజు॥**

ఓ విద్యారూప పరమేశ్వరా ! ఓ ధర్మాధికారీ ! లోకంలో సమస్త ప్రాణులు ఎటువంటి కృపాదృష్టితో మిత్రునివలె మమ్ము చూచుచున్నవో, మేముకూడా సర్వప్రాణులను మిత్రునివలె చూచెదము. మేము పరస్పరము ఈర్ష్యాద్వేషాలు లేక ఒకరి నొకరం మిత్రుని వలె చూసేశక్తి మాకు ప్రసాదింపుము.

మనుష్యుడు సంఘజీవి. సంఘం వ్యక్తి మీద, వ్యక్తి సంఘం మీద ఆధారపడి వుండటం చేత ప్రతి మనుష్యుడు ఈ ధర్మములను దృష్టిలో వుంచుకొని తన నిత్యకర్మ లందు వర్తించవలెను. శుద్ధజ్ఞానకర్మోపాసన ద్వారానే వ్యక్తి యోగి కాగలుగుతాడు. నిత్యం మనం భగవంతుని ప్రార్థిస్తాము.

**'అవిద్వేషం కృణోమివః'**

ఓ పరమేశ్వరా! మమ్ములను ద్వేష రహితులుగా చేయుము. సంధ్యోపాసన యందు కూడా భగవంతుని ప్రార్థన వుంది.

**యో అస్మాన్ ద్వేష్టి యం వయం ద్విష్మ స్తంవో జంభేదధ్మః**

ఎవరు మమ్ము ద్వేషిస్తున్నారో, ఎవరిని మేము ద్వేషిస్తున్నామో మా ఇరువురియందు అట్టి ద్వేషభావము దూరమై అన్యోన్యత పెరిగి సామాజిక జీవనము సుఖవంతం కావాలి. అనేక భాషలు, అనేక ధర్మములు కలిగిన ఈ దేశమంతా ఒక గృహం వంటిది. మనమందరము ఒక కుటుంబము వంటి వారము అన్న భావముతో స్వార్థమును విడిచి హితము కోరినపుడే **'వసుధైక కుటుంబము'** అన్న ఆర్యోక్తి నిజమవుతుంది.

ఆర్యులు, జ్ఞానులు, సంస్కారవంతులు, విద్వాంసులు శాస్త్రీయ తర్కముతో సత్యాన్ని గ్రహించాలి. సోమరితనాన్ని విడిచి, పురుషార్థులమై, కర్మయోగులమై మనల్ని మనము సంస్కరించుకొనుచూ పురోగమించ వలెను.

శంఇతిఓ3మ్

**ఓం శంనో మిత్రస్యం వరుణః**
**శంనో భవత్వర్యమాన్**
**శంన ఇంద్రో బృహస్పతిః**
**శంనో విష్ణుః ఉరుక్రమః**
**నమోః బ్రహ్మణే నమస్తే వాయుః**
**త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మోసి**
**త్వామేవ ప్రత్యక్షం బ్రహ్మావదిష్యామి ఋతం వదిష్యామి**
**సత్యం వదిష్యామి తన్మామవతు తత్వక్తారమవతు**
**అవతుమాం అవతువక్తారం**
**ఓం శాంతిః శాంతిః శాంతిః**